శుక్రవారం
12-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 21
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కాలిఫోర్నియాలో కాల్పులు: ముగ్గురి మృతి

అలమెడ: కాలిఫోర్నియాలోని ఓ ఇంట్లో కాల్పుల ఘటన కలకలం రేపింది. ఓ వ్యక్తి ఇంటోకి చొరబడి కాల్పులకు తెగబడినట్లు తెలిసింది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోగా పిల్లలతో పాటు కొందరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. . అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అలమెడ నగరంలోని కిట్టి హాక్ రోడ్డులోగల 400వ బ్లాకులో తన పొరుగింటిలో కాల్పులు జరిగినట్లు ఓ వ్యక్తి తమకు సమాచారం ఇచ్చినట్లు 'ఫేస్‌బుక్'లో అలమెడ పోలీసు శాఖ తెలిపింది. ఘటనాస్థలానికి వెళ్లి చూడగా కొందరు కుటుంబ సభ్యులు గాయపడినట్లు గుర్తించామని, ముగ్గురు చనిపోయినట్లు తెలపడం బాధాకరమని పేర్కొంది. అయితే కాల్పులకు కారణమేమిటో తెలియాల్సి ఉన్నట్లు తెలిపింది.

'లా' చదువులోకి మనుస్మృతి

డీయూ కసరత్తు: నేడు అకడమిక్ కౌన్సెల్ నిర్ణయం

అమలు చేయొద్దంటూ వైస్ ఛాన్సలర్‌కు ఎన్‌డీటీఎఫ్ లేఖ

న్యూదిల్లీ: దిల్లీ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ విద్యార్థులకు 'మనుస్మృతి' బోధనకు రంగం సిద్ధమవుతోంది. విశ్వవిద్యాలయానికి సంబంధించిన అకడమిక్ కౌన్సెల్ శుక్రవారం సమావేశమై... దీనిపై చర్చించనున్నది. ఈ చర్యలపై సోషల్ డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ (ఎస్‌డీటీఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా డీయూ వైస్ ఛాన్సలర్‌కు లేఖ రాసింది. ప్రస్తుత సిలబస్ కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరింది. వెనుకబడిన వర్గాలు, మహిళల పురోగతి, సమాన హక్కులను

- మిగతా 2 లో

పోలవరం గోదారి పాలు

- రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటాం
- పోలవరం ఎడమ కాలువ అక్విడెక్టు పరిశీలించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తమను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ అక్విడెక్ట్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో చంద్రబాబు గురువారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనులు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 72 శాతం పూర్తి చేశామని, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం దానిని సర్వనాశనం చేసిందన్నారు. పోలవరం ఎడమ కాలువకు సంబంధించి ఒక్క ఇటుక, తట్ట మట్టి తీసుకొచ్చి పనులు చేపట్టలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పోలవరం ఎడమ కాలువ పనులు ఉన్నాయని, చివరికి పోలవరాన్ని గోదావరిలో కలిపేసిందని విమర్శించారు. వాస్తవానికి 2021లోనే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. రూ.800 కోట్లు ఖర్చు పెట్టి 93 కిలో మీటర్లు పూర్తి చేస్తే 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించవచ్చని తెలిపారు. 214 కిలోమీటర్ల వరకు పూర్తి చేస్తే తూర్పు, విశాఖ జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరు, ఇంటింటికీ తాగునీరు అందించవచ్చని తెలిపారు. పనులు త్వరగా ప్రారంభించి... త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పోలవరం నిర్మాణం పూర్తయి వ్యవసాయానికి సాగునీరు, ప్రతీ ఇంటికి తాగునీరు అందితే తన జన్మ సార్థకమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లాలో ఉన్న చక్కెర కర్మాగారాలు పడకేసే పరిస్థితుల్లో ఉన్నాయని, ప్రజల శరీరాల్లో చక్కెర ఉండడం వలన చక్కెర ఎక్కువగా తినడం లేదని, ఇథనాల్ తయారీకి ఉపయోగపడేలా రైతులను భాగస్వామ్యం చేస్తూ వారికి న్యాయం జరిగేలా కర్మాగారాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్‌డీఏకి రాష్ట్రంలో అఖండ విజయం ఇచ్చారని, సంపద సృష్టించి ప్రతీ పైసా ప్రజలకు ఖర్చు చేస్తామని తెలిపారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, విశాఖను దోచుకున్న దొంగల మాట నమ్మవద్దని తెలిపారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట ప్రకారం పింఛను, ఉద్యోగులకు జీతాలు ఇచ్చినందుకు గర్వంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అందించి ప్రతీ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మెగా డీఎస్సీ హామీ అమలు చేశామని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జలవనరులశాఖ అధికారులు పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయం 2026 జూన్‌కు పూర్తి
సీఎం చంద్రబాబు
2లో

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించం

కేంద్ర మంత్రి కుమారస్వామి హామీ

విశాలాంధ్ర - గాజువాక: విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రసక్తే లేదని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖమంత్రి హెచ్‌డీ కుమారస్వామి చెప్పుకొచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి అన్ని విధాలా సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కుమారస్వామి గురువారం విశాఖ వచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్ పనివిధానం, ఇబ్బందులను పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులతో మాట్లాడారు. వీఎస్‌పీ కార్పొరేట్ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్) యాజమాన్యంతో మంత్రి కుమారస్వామి సమావేశమయ్యారు. కుమారస్వామి వెంట కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కూడా ఉన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఉక్కు ఉత్పాదక ప్రక్రియపై ఆసక్తి కనబరిచారు. ఉక్కు కర్మాగారంలోని ఈడీ (వర్క్స్) భవనంలోని మోడల్ గదిని సందర్శించారు. అక్కడ ఆర్‌ఐఎన్‌ఎల్ సీఎండీ అతుల్ భట్, విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రాసెస్ తీరు, ముఖ్య లక్షణాల గురించి వివరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్లాంట్ సందర్శనలో భాగంగా కోక్ ఓవెన్స్ డిపార్ట్‌మెంట్, బ్లాస్ట్ ఫర్నేస్-3, స్టీల్ మెల్టింగ్ షాప్-2, వైర్ రాడ్ మిల్ 2 విభాగాలను కుమారస్వామి, శ్రీనివాస వర్మ ఇతర ప్రముఖులతో కలిసి సందర్శించారు. అనంతరం విశాఖ ఉక్కు కర్మాగారంలోని ప్రధాన సమావేశ మందిరంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో కుమారస్వామి, శ్రీనివాసవర్మ సమావేశమయ్యారు. కుమారస్వామి మాట్లాడుతూ ప్లాంట్ మూసివేతపై ఆర్‌ఐఎన్‌ఎల్ కుటుంబం భయపడవద్దని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆశీస్సులు, మద్దతుతో ఉక్కు ఉత్పత్తి 100 శాతం సామర్థ్యానికి చేరుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కేంద్రమంత్రులతో పాటు ఉక్కు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి

- మిగతా 2 లో

'రేషన్' రాకెట్‌లో ఐదుగురు ఐఏఎస్‌లు

- రాష్ట్రవ్యాప్తంగా బియ్యం అక్రమ నిల్వలపై దాడులు
- కాకినాడలోనే 43,249 మెట్రిక్ టన్నులు సీజ్
- సామాన్యుడికి అందుబాటులో నిత్యావసరాలు
- ఏపీఐఐసీ కాలనీలో స్టాల్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజకీయాల ముసుగులో కొందరు పెద్దలు పేదల బియ్యాన్ని కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తారని, దీనిలో ఐదుగురు ఐఏఎస్‌ల హస్తం కూడా ఉందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్‌లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కంది పప్పు అమ్మకాల కౌంటర్‌ను గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా దాడులు చేస్తూ నియంత్రిస్తున్నామని, ఇప్పటి వరకు ఒక్క కాకినాడలోనే 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామని

- మిగతా 2 లో

పెండింగ్ డిమాండ్ల సాధనకు మళ్లీ ఉద్యమిస్తాం

- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన
- 16-18 తేదీల్లో ప్రధాని, ప్రతిపక్ష నేతకు వినతులు
- ఎంపీలకు డిమాండ్ల పత్రాల అందజేత
- ఆగస్టు 9న 'కార్పొరేట్ క్విట్ ఇండియా దినం'
- కేంద్రానికి 15 ముఖ్య డిమాండ్లు
- ఎస్‌కేఎం సర్వసభ్య సమావేశం తీర్మానం

8లో

19 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా గిరిజా శంకర్

సిసోడియాకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

ఇద్దరు ఐపీఎస్‌లకు విజిలెన్స్, హోంశాఖ బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో భారీగా ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. 19 మంది ఐఏఎస్‌లకు వివిధ శాఖల బాధ్యతలను కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీజేశారు. ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా గిరిజా శంకర్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యదర్శిగా సిసోడియాను నియమించారు. సురేశ్‌కుమార్‌కు పెట్టుబడులు మౌలిక సదుపాయాల కార్యదర్శితోపాటు గ్రామ, వార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలను, జీఏడీ కార్యదర్శిగాను నియమించారు. ఇటీవల ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన దిల్లీరావుకు వ్యవసాయశాఖ డైరెక్టరుగా బాధ్యతలు అప్పగించారు. మరో ఇద్దరు ఐపీఎస్‌లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా హరీశ్‌కుమార్ గుప్తా, హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా కుమార్ విశ్వజిత్‌ను ప్రభుత్వం నియమించింది. అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ముఖ్యకార్యదర్శిగా జి.అనంతరాము, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శిగా ఆర్‌పీ సిసోడియా, భూ పరిపాలనా (సీసీఎల్‌ఏ) చీఫ్ కమిషనర్‌గా జి.జయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా గిరిజా శంకర్, మౌలిక వసతులు, పెట్టుబడుల కార్యదర్శిగా ఎస్.సురేశ్‌కుమార్, ఐటీ, ఆర్‌టీజీఎస్ కార్యదర్శిగా సౌరభ్ గౌర్, పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శిగా ఎన్.యువరాజ్,

- మిగతా 2 లో

స్థానిక సంస్థలకు రూ.250 కోట్లు

ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్

ఎన్నికల వాగ్దానంలో భాగంగా తొలి సంతకం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విడుదల చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయం రెండవ భవనంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ స్థానిక

- మిగతా 2 లో

ఉద్యోగాల్లో కోటా వద్దు
2లో

ఇదీ లోకం!

బత్తలపల్లిలో సీపీఐ భూపోరాటం

- మఠం భూమిలో ఎర్రజెండాలు పాతిన నేతలు
- వేలాదిగా పాల్గొన్న పేదలు

విశాలాంధ్ర బ్యూరో-బత్తలపల్లి: నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో సీపీఐ అధ్వర్యంలో భూపోరాటం జరిగింది. నిడుమామిడి మఠానికి చెందిన భూమిలో ఎర్రజెండాలు పాతి, గడిసెలు వేశారు. ఈ పోరాటంలో వేలాది మంది పాల్గొన్నారు. ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల కేంద్రంలో మఠానికి చెందిన సర్వే నంబరు 401లో 19.84 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని పేదలకు పంపిణీ చేయాలని ఏడాదిగా సీపీఐ నాయకులు పోరాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఇందుకు అడ్డంకులు సృష్టించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు గురువారం లబ్ధిదారులతో కలిసి ఎర్రజెండాలతో కదంతొక్కారు. నినాదాలు చేసుకుంటూ నాలుగు రోడ్ల కూడలి నుంచి సంబంధిత స్థలం వరకు వెళ్లి జెండాలు పాతారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ భూమిని నకిలీ దస్త్రాల ద్వారా వైసీపీ నాయకులు సొంతం చేసుకోవాలని యత్నించారన్నారు. ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ వారి ప్రయత్నాలను అడ్డుకున్నామని చెప్పారు. మఠం వారిని సంప్రదిస్తే ఆ భూమి ఎవరికీ రాసివ్వలేదని, పేదలకు అందితే తాము కూడా సంతోషిస్తామని చెప్పారన్నారు. అందుకే ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా ఇచ్చే వరకు భూపోరాటం చేస్తామని తెలిపారు. బెదిరింపులకు

- మిగతా 2 లో

21 ఒప్పందాలపై బంగ్లాదేశ్, చైనా సంతకాలు

మరో ఏడు ప్రాజెక్టుల ప్రకటన

బీజింగ్: బంగ్లాదేశ్, చైనా మధ్య 21 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేలా కొత్తగా ఏడు ప్రాజెక్టులను రెండు దేశాలు ప్రకటించాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని లియాంగ్‌తో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా బీజింగ్‌లోని గ్రేట్ పీపుల్స్‌హాల్‌లో భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య సయోధ్య, వాణిజ్యంపై మాట్లాడుకున్నారు. తమ మధ్య వ్యూహాత్మక భాగస్వామాన్ని... సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించారు. బంగ్లాదేశ్‌కు నాలుగు విధాలా ఆర్థిక సహకారాన్ని చైనా అందిస్తుందని సమావేశంలో జిన్‌పింగ్ తెలిపారు. నిధులు సమకూర్చడమే కాకుండా వడ్డీలేని రుణాలు, రాయితీలతో కూడిన రుణాలు, వాణిజ్య రుణాలను అందిస్తుందని వెల్లడించారు. కాగా, ఇద్దరు అధినేతల మధ్య చర్చలు ఫలప్రదంగా సాగినట్లు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి డాక్టర్ హసన్ మెహమూద్ వెల్లడించారు. రొహింగ్యాలు, వాణిజ్యం, వర్తకం, పెట్టుబడులతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలు, సవాళ్లపై అధినేతలు చర్చించినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాల్లో కోటా వద్దు

బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళన

రహదారులు, రైల్వేలైన్ల దిగ్బంధం

రిజర్వేషన్లను తాత్కాలికంగా రద్దు చేసిన సుప్రీం

ఢాకా: ఉద్యోగాల్లో కోటా వద్ద అంటూ బంగ్లాదేశ్‌లో విద్యార్థులు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. రాజధాని ఢాకాతో సహా అన్ని ప్రధాన నగరాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. వేలాది మంది రోడ్లపైకొచ్చి ప్రభుత్వ రిజర్వేషన్ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెరిట్ ఆధారిత వ్యవస్థ కోసం డిమాండ్ చేశారు. రహదారులు, రైల్వేలైన్లు దిగ్బంధించారు. తమ డిమాండ్లను పరిష్కరిస్తే తప్ప తరగతులను వెళ్లమని తేల్చిచెప్పారు. ఆందోళనను విరమించి తరగతులకు హాజరు కావాలని ప్రధాన న్యాయమూర్తి ఓబైదుల్ హసన్ ఇచ్చిన పిలుపును బేఖాతరు చేశారు. ఆందోళనలు కొనసాగించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ బంగ్లాదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో దాదాపు సగం వరకు కోటా వ్యవస్థ రిజర్వు అవుతుండటంతో విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. వాళ్లు గతనెలలోనూ ఆందోళనలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసినవి తాత్కాలిక ఉత్తర్వులను, కోటా వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ ఆదేశాలివ్వాలని, కేవలం దివ్యాంగులు, మైనారిటీలకు మినహా ఇతర ఏ రిజర్వేషన్లు ఉండరాదని నిరసనల్లో పాల్గొన్న చిత్తాగాంగ్ యూనివర్సిటీ విద్యార్థి నేత అహ్మద్, ఢాకా యూనివర్సిటీ విద్యార్థి పర్వేజ్ ముషారఫ్ అన్నారు. ఇదిలావుంటే, బంగ్లాదేశ్ విమోచనం కోసం 1971లో జరిగిన పోరాటంలో పాల్గొన్న వారి పిల్లల కోసం ఉద్యోగాల్లో 30శాతం కోటాను రిజర్వు చేశారు. అలాగే మహిళలకు 10శాతం, ప్రత్యేకంగా కొన్ని జిల్లాల వారికి 10శాతం చొప్పున కోటా కల్పించారు. మైనారిటీలు, దివ్యాంగులకు ఆరు శాతం రిజర్వేషన్ ఇచ్చారు. ఇలా ఉద్యోగాల్లో దాదాపుగా సగం రిజర్వు కావడం వల్ల తమకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతున్నాయని, మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చేలా వ్యవస్థ ఉండాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మహిళల కోసం కోటా అక్కర్లేదన్నారు. మహిళలు కూడా నైపుణ్యత ఆధారంగా ముందుకు వెళుతున్నారని, కోటా వ్యవస్థ వల్ల అవరోధాలు సృష్టిస్తూ... హక్కులు హరిస్తున్నారని ఓ విద్యార్థిని మీనా రాణి దాస్ (22) అన్నారు.

పటిష్ఠ షాంఘై కూటమికి చైనా కసరత్తు



బీజింగ్: అమెరికా నేతృత్వ వరల్డ్ ఆర్డర్‌కు దీటుగా షాంఘై కూటమిని తీర్చిదిద్దాలని చైనా సంకల్పించింది. వరల్డ్ ఆర్డర్‌కు ప్రత్యామ్నాయంగా ఈ కూటమి ఉండాలని భావిస్తోంది. షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) విస్తరణ క్రమంలో తమ నాయకత్వాన్ని చైనా బలపర్చుకుంటోందని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఏషియన్ రీసెర్చ్‌లో ఏషియన్ సెక్యూరిటీ సినయర్ ఫెల్లో బేట్స్ గిల్ పేర్కొన్నారు. ఎస్‌సీఓ సదస్సు ఇటీవల కజకస్థాన్‌లో జరిగింది. పరస్పరం సహకరించుకోవాలని సదస్సు తీర్మానించింది. కలిసి ముందుకు వెళ్లేందుకుగాను తమ వ్యూహాత్మక మిత్రదేశం రష్యాతో పాటు ఇతర భాగస్వామ్య దేశాలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని, ప్రభావాన్ని తగ్గించేందుకు తామంతా ఏకం కావాలంటూ చైనా, రష్యా పిలుపులిచ్చాయి. 2001లో బీజింగ్, మాస్కో ద్వారా ఆర్థిక, భద్రతా సంఘం ఏర్పాటైంది. భారత్, పాకిస్థాన్‌తో పాటు అనేక సెంట్రల్ ఆసియా దేశాలకు భాగస్వామ్యం లభించింది. గతేడాది ఇరాన్, బెలారస్ కూడా ఎస్‌సీఓ సభ్యదేశాలుగా చేరాయి. ఎస్‌సీఓ సదస్సు చేసిన ఉమ్మడి తీర్మానంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రస్తావన లేకపోగా తాజాగా వాషింగ్టన్‌లో ముగిసిన నాటో సదస్సు ఉక్రెయిన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేసింది.

మల్టీ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభించిన సీజేఐ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో మల్టీ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం ప్రారంభించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సహా సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణంతో ప్రజలకు సులభంగా న్యాయం జరుగుతుందన్నారు. మల్టీ పర్పస్ సెంటర్ 'యాక్సెస్ టూ జస్టిస్ ఫర్ ఆల్' క్యాంపెయిన్‌లో భాగమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆవరణలోని యూకో బ్యాంక్ ఎదురుగా ఉన్న సీ-ఇన్ గేటు సమీపంలో ఈ భవనాన్ని నిర్మించారు. ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులందరూ ఒకేచోట కేసులు నమోదు చేయడానికి, కేసులకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు వీలుగా ఫెసిలిటీ సెంటర్ నిర్మించారు. దాంతో సేవల్లో నాణ్యత పెరగనున్నది. ఈ సందర్భంగా సీజేఐపై కపిల్ సిబల్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఎప్పుడూ హడావుడిగా ఉంటారని తాను చెప్పగలనని, ఆయన దేశంలోని న్యాయవాదులకు, కక్షిదారులకు ఏదో ఒకటి చేయాలనుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన వేగం, భవిష్యత్ గురించి ఆలోచనలను చూసి తాము ఆశ్చర్యపోయామని, ఈ దేశ న్యాయ వ్యవస్థపై ఆయనకున్న నిబద్ధతకు ఈ ఫెసిలిటీ సెంటర్ ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

భోగాపురం విమానాశ్రయం 2026 జూన్‌కు పూర్తి

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-విజయనగరం/భోగాపురం : ఉత్తరాంధ్రలో భోగాపురం విమానాశ్రయం కీలకం కానుందని, దీనిని 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమనాశ్రయ పనుల ప్రగతిని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం నిర్మాణం అనుకున్న విధంగా జరిపించే బాధ్యత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుదేనని అన్నారు. ఈ విమానాశ్రయానికి అనుసంధానం పెంచాల్సిన అవసరం ఉందని, దీనికి సమాంతరంగా మరో ఐదారు విమానాశ్రయాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కుప్పం, దగదర్తి, మూలపేటలో కూడా విమానాశ్రయాలు తీసుకువచ్చే దిశగా ఆలోచిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే రాయగడ్, కోరాపుట్, మల్కన్ గిరి, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత విశాఖపట్నం విమానాశ్రయం 2.8 మిలియన్ ప్రయాణీకులకు సేవలందిస్తోందని, భోగాపురం విమానాశ్రయం 4.8 మిలియన్ ప్రయాణికులకు సేవలందించే విధంగా ప్రారంభమవుతుందన్నారు.

సుమారు 45 మిలియన్ ప్రయాణీకులకు సేవలందించే సామర్థ్యం కలిగి ఉంటుందని వివరించారు. అందరికీ న్యాయం చేస్తామని, ఉత్తరాంధ్రకు మరింత అదనంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే లోకం మాధవి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి, జీఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించం

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ రాయ్, ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎస్ఏఐఎల్ స్వతంత్ర డైరెక్టర్ సాగి కాశీ విశ్వనాథరాజు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్లు ఏకే బాగ్చి, డాక్టర్ ఎస్‌సీ పాండే, సీహెచ్ గణేశ్, జీవీఎన్ ప్రసాద్, కరుణ రాజు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, ఆర్ఐఎస్ఎల్, సీజీఎంలు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు రూ.250 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను విడుదల చేస్తూ దస్త్రంపై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివిధ గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా ఈ నిధులను విడుదల చేసినట్లు మంత్రి మీడియాకు తెలిపారు. గత ప్రభుత్వం విపరీతంగా పన్నులు పెంచేసిందని, వ్యాపారాలు చేసుకోలేనంత స్థాయిలో పన్నులను పెంచడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిస్థాయిలో దెబ్బతిందన్నారు. పన్నులు తక్కువగా ఉన్నాయని పొరుగు రాష్ట్రాల్లో వాహనాలు కొనడంతో పాటు పెట్రోల్ కూడా కొట్టించుకుంటున్నారని గుర్తు చేశారు. చివరకు ఆర్టీసీ సైతం కర్నాటకలో డీజిల్ కొట్టించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక్క ఫార్చూనర్ కారు పక్క రాష్ట్రాల్లో కొనడం వల్ల ఏపీకి రూ.16 లక్షల మేర ఆదాయం కోల్పోతోందని తెలిపారు. పన్నులు పెంచడం ద్వారా రాబడి పెంచుకోవాలనే జగన్ ఆలోచనా విధానం వల్ల ఏపీలో వ్యాపారాలే లేకుండా పోయాయని మంత్రి ధ్వజమెత్తారు. ఏపీ ఆర్థిక వ్యవస్థను జగన్ ధ్వంసం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల మరి కొన్నాళ్ల పాటు అప్పులు చేయక తప్పని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. ఆదాయాలు పెరగాలంటే పన్నులు పెంచడమే మార్గం కాదని, పన్నుల విస్తృతిని పెంచాలని సూచించారు. ఇష్టానుసారంగా పార్టిషన్ రిజిస్ట్రేషన్ ఫీజు పెంచేశారని, దీనివల్ల తెల్ల కాగితాల మీద పంపకాలు చేసుకుంటున్నారన్నారు. ఫలితంగా భవిష్యత్‌లో తలెత్తే వివాదాలకు జగన్ కారణమయ్యారని విమర్శించారు. ఏదిఏమైనా ఏపీ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టి, రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు టీమ్ గట్టిగా కృషి చేస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూశ్ కుమార్, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, జానకి, వినయ్ చంద్, రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ గిరిజా శంకర్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.ఆదినారాయణ, డైరెక్టర్ ట్రెజరీస్ మోహన్ రావు, ఏపీజీఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో అనేక మంది సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రం స్క్రీన్‌షాట్ వైరల్

యూజీసీ నెట్ పేపర్ లీక్ ఆరోపణలపై సీబీఐ

న్యూఢిల్లీ: యూజీసీ నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆ ప్రశ్నపత్రం వక్రీకరించిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేసిన ఓ విద్యార్థిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ స్క్రీన్‌షాట్ ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో కేంద్ర విద్యాశాఖ పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో విస్తృతస్థాయి కుట్ర ఏమీ జరగలేదని సీబీఐ గుర్తించింది. లీకైన ఆ ప్రశ్నపత్రం వక్రీకరించినదని, ఆ స్క్రీన్‌షాట్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టడం వెనక ఒక పాఠశాల విద్యార్థి ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఒక యాప్ ద్వారా ఈ చర్యకు ఒడిగట్టారని చెప్పారు. దానిపై డేట్‌ను జూన్ 17గా మార్పు చేశారని తెలిపారు. తనవద్ద పరీక్ష ప్రశ్నపత్రం కూడా ఉందని నమ్మించి, కొంత డబ్బు సంపాదించేందుకే దానిని వైరల్ చేసినట్లు వెల్లడించారు. అది మార్పులు చేసిన పేపర్ అని ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించినట్లు చెప్పారు. ఈ వివరాలను సీబీఐ అనధికారికంగా ప్రభుత్వానికి వెల్లడించిందని, ఆ విద్యార్థిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత కోసం జూన్ 18న దేశవ్యాప్తంగా యూజీసీ నెట్ పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ కేంద్ర హోంశాఖ అధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి (ఐసీసీసీ) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం యూజీసీకి ఓ నివేదిక ఇచ్చింది. దీంతో పరీక్షల్లో అవకతవకలు జరిగాయనడానికి ప్రాథమిక ఆధారాలున్నాయని యూజీసీ నిర్ధారించింది. పారదర్శకత, విశ్వసనీయత కోసం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ సంచలన ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా అనేక కేంద్రాల్లో పెన్ను, పేపర్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షను 9 లక్షల మందికి పైగా విద్యార్థులు రాశారు.

నీట్ ప్రశ్నపత్రం వైరల్ కాలేదు: సీబీఐ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ - యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై గురువారం సుప్రీంకోర్టులో సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసింది. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ దీనిలోని వివరాలను కొన్ని జాతీయ మీడియా కథనాలు ప్రచురించాయి. నీట్ పేపర్ లీక్ విస్తృతస్థాయిలో జరగలేదని, ఒక ప్రాంతానికే పరిమితమని దర్యాప్తు సంస్థ తన అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు వెల్లడించాయి. బీహార్‌లో ఒక పరీక్ష కేంద్రంలో మాత్రమే పేపర్ లీక్ జరిగిందని, అది కొద్దిమంది విద్యార్థులపై మాత్రమే ప్రభావం చూపిందని సీబీఐ పేర్కొన్నట్లు సమాచారం. అలాగే లీకైన పేపర్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టలేదని తన నివేదికలో ప్రస్తావించింది. ఇదిలాఉంటే... కేంద్రం వాదన కూడా ఇదేతరహాలో ఉంది. నీట్ (యూజీ)లో మాల్ ప్రాక్టీస్ జరిగిందనడానికి గానీ, కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు లబ్ధి పొందేలా అక్రమాలు జరిగాయనడానికి గానీ ఎలాంటి ఆధారాల్లేవని కోర్టుకు సమర్పించిన పత్రాల్లో స్పష్టం చేసింది.

19 మంది ఐఏఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

మైనార్టీ సంక్షేమ కార్యదర్శిగా కె.హర్షవర్ధన్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శిగా పి.భాస్కర్, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా కె.కన్నబాబు, పర్యాటక శాఖ కార్యదర్శిగా వాడ్రేవు వినయ్ చంద్, యువజన సర్వీసులు, క్రీడల శాఖ కార్యదర్శిగా వివేక్ యాదవ్, మహిళా, శిశు సంక్షేమ కార్యదర్శిగా ఎ.సూర్యకుమారి, ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా డాక్టర్ సి.శ్రీధర్, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శిగా జె.నివాస్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా వి.విజయ రామరాజు, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా హిమాన్షు శుక్లా , అగ్రికల్చర్ శాఖ డైరెక్టర్‌గా దిల్లీ రావు నియమితులయ్యారు.

'రేషన్' రాకెట్‌లో ఐదుగురు ఐఏఎస్‌లు

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఈమాఫియా వెనుక చాలా మంది పెద్దలు, కీలక అధికారుల హస్తం ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని, దోషులుగా తేలితే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ మార్కెట్లో చుక్కలు తాకుతున్న నిత్యావసర సరుకుల ధరలను సామాన్యుడికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దీనిలో భాగంగానే రాయితీపై బియ్యం, కంది పప్పు విక్రయిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 284 స్టాల్స్ ఏర్పాటు చేశామని, కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో దాదాపు కిలో రూ.181 అమ్ముతున్నారు. బియ్యం ధరలు ఆకాశాన్ని అంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ అవుట్ లెట్లు ప్రారంభించాం. మా అవుట్ లెట్లలో కిలో దేశవాళి కందిపప్పు రూ.160కే అందిస్తున్నాం. అలాగే సోనామసూరి (స్టీమ్) కిలో రూ.49, సాధారణ రకం రూ.48 విక్రయిస్తున్నాం. ప్రతి రోజు 125 క్వింటాల కందిపప్పు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో వీటితోపాటు మిల్లెట్స్, పంచదార, రాగి పిండి తక్కువ ధరకే అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, రైతు, వినియోగదారుడికి మేలు జరగాలన్నదే తమ ఆకాంక్ష అని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో గత ప్రభుత్వం ధాన్యం రైతులకు బకాయిపెట్టిన వాటిలో రూ.1000 కోట్లు ప్రభుత్వం ఏర్పడిన 15 రోజుల్లోనే చెల్లించామని, మరో రూ. 650 కోట్లు త్వరలోనే చెల్లిస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ వీర పాండియన్, జిల్లా కలెక్టర్ సృజన పాల్గొన్నారు.

'లా' చదువులోకి మనుస్మృతి

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించే మనుస్మృతిని బోధించడం తిరోగమన చర్య అవుతుందని స్పష్టంచేసింది. ఎల్ఎల్‌బీ విద్యార్థులకు మనుస్మృతి (మనుచట్టాలు) బోధించాలనే ప్రతిపాదనపై అకడమిక్ కౌన్సెల్ చర్చించనున్నందున...దానిని ఆమోదించవద్దని కోరుతున్నట్లు లేఖలో ఎస్‌డీటీఎఫ్ పేర్కొంది. సామాజిక, ఆర్థిక, లింగ అసమానతల వల్ల మనుస్మృతి వివాదాస్పమైంది. ప్రథమ, తృతీయ సంవత్సర లా విద్యార్థులకు మనుస్మృతి బోధించేలా సిలబస్‌లో మార్పులకు దిల్లీ యూనివర్సిటీ అత్యున్నత న్యాయనిర్ణేత సంఘం అనుమతిని ఫ్యాకల్టీ ఆఫ్ లా కోరింది. సవరించిన సిలబస్ పత్రాన్ని అకడమిక్ కౌన్సెల్ ఆమోదానికి పంపింది. కౌన్సెల్ ఆమోదం లభిస్తే మనుస్మృతితో పాటు జీఎన్ ఝా రచన మేధాతిథి-మనుభాష్యకు కూడా సిలబస్‌లో చోటుదక్కుతుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి. పాఠ్యాంశాల్లో సవరణలు సూచించే నిర్ణయాన్ని డీన్ అంజు వలీ టిక్రూ నేతృత్వ ఫ్యాకల్టీ కోర్స్ కమిటీ జూన్ 24న ఏకగ్రీవంగా ఆమోదించింది. మనుస్మృతి బోధనకు సంబంధించిన కసరత్తును వామపక్ష అనుబంధ సోషల్ డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ (ఎస్‌డీటీఎఫ్) తీవ్రంగా వ్యతిరేకించింది. మహిళలు, వెనుకబడిన వర్గాల హక్కులను వ్యతిరేకించే మనుస్మృతిని బోధనాంశాల్లో చేర్చడం ఏమిటంటూ ప్రశ్నించింది. ఈ మేరకు డీయూ వీసీ యోగేశ్ సింగ్‌కు లేఖ రాసింది. ప్రగతిశీల విద్యా వ్యవస్థకు మనుస్మృతి పూర్తి విరుద్ధమని పేర్కొంది. విద్యార్థులకు మనుస్మృతి బోధించమనడం ఆక్షేపణీయమని ఎస్‌డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ బర్వాల్, చైర్‌పర్సన్ ఎస్‌కే సాగర్ పేర్కొన్నారు. మహిళలు, అణగారిన-వెనుకబడిన వర్గాల విద్యను మనుస్మృతి వ్యతిరేకిస్తుందని గుర్తుచేశారు. మహిళలకు విద్య, సమాన హక్కులకు వ్యతిరేకంగా మనుస్మృతిలో అనేక భాగాలు ఉన్నట్లు వీసీ దృష్టికి తీసుకెళ్లారు. మనుస్మృతిలోని ఒక భాగాన్ని ప్రవేశపెట్టడం భారత రాజ్యాంగ సిద్ధాంతాలకు, దాని ప్రాథమిక నిర్మాణానికి విరుద్ధమని పేర్కొన్నారు. మనుస్మృతి బోధించాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అకడమిక్ కౌన్సెల్ దీనిని ఆమోదించకుండా చూడాలని కోరింది. ప్రస్తుత సిలబస్ ఆధారిత పేపర్ జురిస్‌ప్రూడెన్స్ బోధన కొనసాగించాలని లా ఫ్యాకల్టీకి, సంబంధిత సిబ్బందికి ఆదేశాలివ్వాలని వైస్ ఛాన్సలర్‌కు ఎస్‌డీటీఎఫ్ విజ్ఞప్తి చేసింది. దేశ జనాభాలో 85 శాతం అణగారిన వర్గాలు ఉంటే... 50 శాతం మహిళలు ఉన్నారని, వీరి పురోగతికి ప్రగతిశీల విద్యావ్యవస్థ ఆధారమని నొక్కిచెప్పింది. మనుస్మృతిని పాఠ్యాంశంగా చేర్చాలనే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, అకడమిక్ కౌన్సెల్ సమావేశంలో దీనిని ఆమోదించవద్దని సోషల్ డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ డిమాండ్ చేసింది.

చంపేస్తామని బెదిరిస్తున్నారు

టీఎంసీ ఎంపీ

కోల్‌కతా: అరెస్టయిన తమ పార్టీ నాయకుడు జయంత్ సింగ్‌ను త్వరగా విడుదల చేయకపోతే తనను చంపేస్తానని ఫోన్‌లో బెదిరించారని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ సౌగతా రాయ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తనకు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఫోన్ చేసిన వ్యక్తి బెదిరించడమే కాకుండా... తనను అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడని సౌగతా రాయ్ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లాలోని అరియాదాహా ప్రాంతానికి చెందిన టీఎంసీ నాయకుడు జయంత్ సింగ్‌ను గత నెల 30న జరిగిన ఓ హింసాత్మక ఘటనలో ప్రధాన నిందితుడిగా పోలీసులు అరెస్టు చేశారు. అరియాదాహా... డమ్ డమ్ లోక్‌సభ నియోజకవర్గం కిందకు వస్తుంది. ఈ స్థానానికి సౌగతా రాయ్ గత నాలుగు పర్యాయాలు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే గుర్తుతెలియని నెంబర్ నుంచి రెండు బెదిరింపు కాల్ వచ్చినట్లు రాయ్ పేర్కొన్నారు. అరియాదాహాకు వెళితే చంపేస్తానని కూడా కాల్ చేసిన వ్యక్తి చెప్పాడని పేర్కొన్నారు. తర్వాత తాను బరాక్‌పూర్ పోలీస్ కమిషనర్‌ను సంప్రదించి నంబర్‌ను ట్రాక్ చేయమని కోరినట్లు చెప్పారు. అనంతరం తాను కూడా పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

జయంత్ సింగ్‌పై కేసు పూర్వాపరాలు

జూన్ 30న కళాశాల విద్యార్థిని ఆమె తల్లిపై దాడి చేసిన కేసులో జయంత్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ వైరల్ అయింది. ఇందులో కొంతమంది వ్యక్తులు ఇద్దరు వ్యక్తులను కొట్టడం కనిపించింది. అరియాదాహాలో ఒక బాలికపై కొంతమంది వ్యక్తులు దాడి చేసినట్లు చూపుతున్న పాత వీడియో ఆధారంగా పోలీసులు సింగ్‌పై సుమోటో కేసు నమోదు చేశారు. మంగళవారం ఈ ఘటనకు సంబంధించి సింగ్ సన్నిహితుడు పట్టుబడ్డాడు. ఈ కేసులో ఇప్పటి ముగ్గురిని అరెస్ట్ చేశారు. 2023లో మరో కేసులో అరెస్టయి, ఇకపై ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడనని హామీ ఇచ్చి బాండ్‌తో బెయిల్‌పై బయటకు వచ్చాడు జయంత్. ఆ షరతును ఇప్పుడు ఉల్లంఘించినందుకు ఆయన తాజా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు.

బత్తలపల్లిలో సీపీఐ భూపోరాటం

(మొదటిపేజీ తరువాయి)

తలొగ్గకుండా గుడిసెలు వేసుకొని ఉండాలని పేదలకు సూచించారు. ఊర్లు నిర్మించామని చెప్పిన నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి...కేవలం తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంచి చేశారని నేతలు విమర్శించారు. పోరాటంలో రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కాటమయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, మండల కార్యదర్శి వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుల్లాయప్ప, ధర్మవరం పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి రమణ, ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకల రాజా, ఆదినారాయణ, చెన్నా భుజంగం, రామకృష్ణ, నిర్మలమ్మ, సావిత్రమ్మ, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఏపీ సహా 16 రాష్ట్రాల సీఎస్‌లు, ఆర్థిక శాఖ కార్యదర్శులకు సుప్రీం సమన్లు

ఆగస్టు 23న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం

న్యూఢిల్లీ: వేతన కమిషన్ సిఫార్సులను బేఖాతరు చేసిన ఆంధ్రప్రదేశ్ సహా 16 రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక శాఖ కార్యదర్శులకు సుప్రంకోర్టు సమన్లు జారీచేసింది. పింఛన్ బకాయితో పాటు పదవీ విమరణకు సంబంధించినవి న్యాయాధికారులకు చెల్లించాలని రెండవ జాతీయ న్యాయ పే కమిషన్ చేసిన సిఫార్సులను ఎందుకు అమలు చేయలేదని చీవాట్లు పెట్టింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. 'ఆదేశాలను ఎలా అమలు చేయించాలో మాకు తెలుసు. అఫిడవిట్ దాఖలు చేయకపోతే సీఎస్ హాజరు కావాలని చెప్పి వదిలేస్తే పని జరగదు. వాళ్లను మేమేమీ జైలుకు పంపడం లేదు. ఇక్కడకు రమ్మంటున్నాం. ఆపై అఫిడవిట్ దాఖలవుతుంది. వారంతా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలి' అని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఇప్పటివరకు అనేక అవకాశాలు ఇచ్చినప్పటికీ ఆదేశాల సక్రమ అమలు జరిగిన దాఖలాలు లేవని అసంతృప్తి వ్యక్తంచేసింది. సీఎస్‌లు, ఆర్థిక శాఖ కార్యదర్శులు వ్యక్తిగతంగా హాజరు కాని పక్షంలో చర్యలు తప్పబోవని కూడా ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ మేరకు సమన్లను ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, దిల్లీ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మేఘాలయ, మధ్యప్రదేశ్, తమిళనాడు, మణిపూర్, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాలకు జారీచేసింది. ఆగస్టు 23న సీఎస్‌లు, ఆర్థికశాఖ కార్యదర్శులు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఇకపై గడువు ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. పే కమిషన్ ఆదేశాల అమలుపై ఆగస్టు 20లోగా నివేదిక ఇవ్వాలని కూడా స్పష్టంచేసింది. కాగా, తమ రాష్ట్రం వరదల్లో చిక్కుకొని ఉండటంతో ఆదేశాలను వాయిదా వేయాలని అసోం విన్నవించగా ధర్మాసనం తిరస్కరించింది. అలాగే కేంద్రప్రభుత్వ అనుమతి కోసం వేచివున్నట్లు దిల్లీ చెప్పగా 'దాంతో మాకు సంబంధం లేదు... అది మీరు మీరూ తేల్చుకోండి' అని సీజేఐ అన్నారు. అమికస్ క్యూరీ కె.పరమేశ్వర్ (న్యాయవాది) తెలిపిన వివారాలాధారంగా తాజా ఉత్తర్వులను సుప్రీంకోర్టు ధర్మాసనం జారీచేసింది.

ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

- డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలి
- కస్తూర్బా విద్యాసంస్థల్లో సీట్లు పెంచాలి
- ఇంజినీరింగ్ ఫీజులు నిర్ణయించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల హాస్టళ్లలో సమస్యలు సేకరించి వాటిని పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వీ జాన్సన్ బాబు, కే శివారెడ్డి హెచ్చరించారు. స్థానిక దాసరి నాగభూషణ్ భవన్‌లోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈ నెల 20 నుంచి 30 వరకు 26 జిల్లాలలోని ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి సమస్యలు సేకరించాలని కాకినాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. మూతబడిన హాస్టళ్లను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. చాలావరకు హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటి మరమ్మతులు చేయాలని, పూర్తిగా పాడుబడినవాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కోరారు. మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా గురుకుల విద్యాసంస్థలలో సీట్ల సంఖ్య పెంచాలని అన్నారు. విద్యార్థులకు ట్రంకు పెట్టలు ఇవ్వాలని, చాలా హాస్టల్లో కనీసం స్నానపు గదులుగాని, టాయిలెట్స్ కూడా లేవన్నారు. మెస్ చార్జీలు అందక వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యమైన ఆహారం అందాలంటే మెస్ బిల్లులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం తీసుకురావడంతో చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా చాలా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు లేక మూతబడడానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలకు ఫీజులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయి స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య, హనుమంతు, నాయకులు అయ్యప్ప, నవీన్, సాయికుమార్ పాల్గొన్నారు.

అది... తల్లికి వందనమా? వంచనా?

మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటిలో ఎంత మంది పిల్లలుంటే అన్ని రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి, ఇప్పుడు కేవలం ఒక్కరికే ఇస్తామనడం తల్లికి వందనమా? వంచనా? అని మాజీ మంత్రి అంబటి రాంబాబు కూటమి నేతలను సూటిగా ప్రశ్నించారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ కాదని, సూపర్ మోసమని ఎద్దేవా చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అంబటి మాట్లాడుతూ పేదరికంలో ఉన్న పిల్లలను చదివించేం దుకు దేశంలో ఏ నాయకుడు చేయని వినూత్న ఆలోచన చేసిన మొదటి వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున 42 లక్షలపై చిలుకు తల్లుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రభుత్వం తల్లికి వందనం డబ్బులు ఎప్పుడు వేస్తుందో చెప్పాలని అన్నారు. ఇంటిలో ఒక్కరికే రూ.15 వేలు మాత్రమే జగన్ ఇస్తున్నారని, మమ్మల్ని అధికారంలోకి తీసుకొస్తే ఒకరైతే రూ.15 వేలు, ఇద్దరుంటే... రూ.30 వేలు, ముగ్గురు ఉంటే... రూ.45 వేలు, నలుగురు పిల్లలుంటే రూ.60 వేలు... మీ ఇంటికి తీసుకొచ్చి ఇస్తామని ప్రకటిస్తే ప్రజలు ఆకర్షితులై ఓట్లేసి గెలిపించారన్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబే కాదు, లోకేశ్, పవన్ కల్యాణ్‌తో పాటు కూటమిలో ఉన్న అందరూ ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ... తెలుగుదేశం పార్టీ ప్రచార వీడియోలను అంబటి ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు-29 విడుదల చేసిందని, అందులో చాలా అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుకు ఉందా? లేదా? అని అంబటి నిలదీశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం - 6ఎ

చట్టం నెం.30/2013లోని సెక్షన్ 11 (1) మరియు రూలు 19 (1) క్రింద

Gazeette No : 101/KST/2024 Dt : 08-07-2024

ప్రాధమిక ప్రకటన

ఆర్.సి.నెం. జి/యల్ 7.2022 తేది : 08-07-2024

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరిచిన **ఉంగుటూరు మండలము, ఉంగుటూరు గ్రామములో** ఉన్న భూములను ప్రజాహిత కార్యక్రమముల నిమిత్తము అనగా బుడమేరు మీద **HLB** వంతెన నిర్మించు నిమిత్తము అవసరమై ఉన్నదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, భూమి అవసరమైనట్లుగా కృష్ణాజిల్లా, కలెక్టరు గారు చట్టములోని విభాగము 3 (ఇ) ప్రొవిజన్ మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ పునరావాస మరియు పునర్నిర్మాణము రూల్స్ 2014లోని నిబంధన 2 (1) (బి) క్రింద అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కలెక్టరు వారు భావించినందున భూసేకరణ పునరావాస మరియు పునర్నిర్మాణములో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం 2013లోని విభాగం 11 (1)లో ఉన్న నిబంధనల మేరకు ఈ విషయము గురించి అందుకు సంబంధించిన వారందరికీ ఎరుక నిమిత్తం ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు భూసేకరణ వలన ఒక భూ యజమాని మాత్రమే ప్రభావితము కాగలరు. నిర్వాసితులు లేరు. ప్రభావితము అగుటకు గల కారణములు దిగువ ఇవ్వడమైనవి.

చట్టంలోని సెక్షన్ 43 (1) మేరకు ప్రభావిత వ్యక్తుల సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1 రెవిన్యూ (భూ.సే) శాఖ తేది : 02-01-2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టరు గారు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడినారు.

చట్టములోని సెక్షన్‌లోని 3 (ఇ) మరియు రూల్స్ 2014లోని రూలు 2(1)(బి) ద్వారా లభ్యమైన అధికారముల మేరకు కృష్ణాజిల్లా జిల్లా కలెక్టరు ఇందుమూలముగా భూసేకరణ అధికారి/ రెవిన్యూ డివిజనల్ అధికారి, గుడివాడ వారి సిబ్బందికి, పనివారికి కలెక్టరు యొక్క విధులు నిర్వహించుటకు అధికారము ఇస్తున్నారు.

చట్టములోని సెక్షన్ 12 మరియు 20కి లోబడి సర్వే నిర్వహించుటకు రెవిన్యూ డివిజన్ అధికారి మరియు భూసేకరణ అధికారి, గుడివాడ వారిని అనుమతించుచూ సదరు సర్వే నందు భూ యజమానులు ప్రత్యక్షంగా గానీ, అధీకృత ప్రతినిధి ద్వారా గానీ ఈ ప్రకటన జారీ చేయబడిన 60 దినములలో హాజరు కావాలని తెలియచేయడమైనది. లేని యెడల వారి పరోక్షమున సర్వే నిర్వహించబడును.

భూసేకరణ చట్టం 2013 లోని విభాగం 11 (4) ప్రకారం జిల్లా కలెక్టర్ గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ భూములపై ఎటువంటి లావాదేవీలు అనగా అమ్మకం, కొనుగోలు చేయుట లేక ఋణములు తీసుకొనుట ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి ఎవ్వరు చెయకూడదని తెలియచేయడమైనది.

విభాగము 15 (1) ననుసరించి ఈ భూసేకరణపై ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఆసక్తి గల వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించిన 60 దినములలోగా భూసేకరణ అధికారి/ రెవిన్యూ డివిజనల్ అధికారి, గుడివాడ వద్ద భూమి విషయములలో, భూమి ఉపయుక్తము మరియు ప్రజాహిత ప్రయోజనములపై అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు : బుడమేరు మీద HLB వంతెన నిర్మించు నిమిత్తము

జిల్లా : కృష్ణా **మండలము : ఉంగుటూరు** **గ్రామం : ఉంగుటూరు**

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం	మొత్తం విస్తీర్ణము ఎ.సెంట్లు	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం	భూమి యొక్క వివరణ మాగాణి/ మెట్ట	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1	216-2బి	0.43	0.21	మెట్ట	పంట వెంకటేశ్వరరావు తండ్రి బైరాగి	216-1	216-3	211	216-2ఏ 217	లేవు

సం/- డి.కె.బాలాజీ, ఐ.ఎ.ఎస్.
కలెక్టర్, కృష్ణాజిల్లా

మోదీ గెలిచి ఓడారు

జె.వి.సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఈ సార్వత్రిక ఎన్నికలలో మోదీ గెలిచి ఓడారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సీపీఐ అనకాపల్లి జిల్లా సమితి సమావేశం గొల్లు గురు బాబు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని కోడుగంటి గోవిందరావు భవన్‌లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కృష్ణుడు, రాముడు పేరు చెప్పి దేశంలోని ఓటర్లందరితో మోదీ మైండ్ గేమ్ ఆడారని విమర్శించారు. ఎన్నికల్లో పాలస్తీనా, ఇజ్రాయిల్ దాడులను కూడా మోదీ అనుకూలంగా మార్చుకొని ప్రచారం చేసుకున్నారన్నారు. ఇజ్రాయిల్‌కు అనుకూలంగా మాట్లాడిన మొట్టమొదటి ప్రధాని మోదీ అని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో మతం, మతతత్వం కంటే నిరుద్యోగమే ప్రధాన పాత్ర పోషించిందన్నారు. సమర్థవంతమైన ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ పార్లమెంటులో మాట్లాడుతున్న తీరు హర్షణీయమన్నారు. ఏడు విడతల సుదీర్ఘ ఎన్నికలు దేశంలో ఇప్పటివరకు ఎప్పుడూ జరగలేదన్నారు. రాష్ట్రంలో జగన్ వై నాట్ 175 అని 5 సంవత్సరాలు విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మద్దతుతోనే ఈ అరాచకాలు చేశాడనడంలో సందేహం లేదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వమే నడుస్తుంది కానీ ఎన్డీఏ కూటమి కాదని, టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉందని తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు రాజకీయం అంతా అమరావతి చుట్టూనే తిరుగుతుందన్నారు. కాగా, సీపీఐ అనకాపల్లి నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, మండల కార్యదర్శులు, మహిళా సమాఖ్య, విద్యార్థి, యువజన సంఘం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్‌పై చర్యలు తీసుకోవాలి

యోగా టీచర్లకు జీతాలు చెల్లించకుంటే నిరాహారదీక్ష: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): యోగా టీచర్లతో పనిచేయించుకుని 18 నెలలుగా జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెడుతున్న బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు హెచ్చరించారు. స్థానిక హనుమాన్‌పేట దాసరి భవన్‌లో గురువారం యోగా టీచర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరుచూరి మాట్లాడుతూ... పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన జీవో ప్రకారం 907 ప్రభుత్వ పాఠశాలలో నియామకాలు చేపట్టారని, యోగ ఇన్స్ట్రక్టర్స్, అసిస్టెంట్లకు నెలకు రూ.30 వేలు జీతం చెల్లిస్తామని చెప్పారన్నారు. అయితే, కేవలం నాలుగు ఐదు నెలలు మాత్రమే రూ.20 వేలకు మించకుండగా కొందరికి మాత్రమేజీతాలు ఇచ్చారన్నారు. గత 18 నెలల నుంచి బుద్ధయోగ హెల్త్ ఫౌండేషన్ జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారని చెప్పారు. అడిగితే... ఉద్యోగాల నుంచి తొలగిస్తానని, భౌతిక దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని ఆశపెట్టి ఒక్కొక్క నిరుద్యోగి నుంచి రూ.ఐదు లక్షల వరకు వసూలు చేశారని వివరించారు. యాజమాన్యం మాయమాటలకు 1400 మంది మోసపోయారని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారక తిరుమలరావు, జనసేన నేతలను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. ఆగస్టు 15 లోపు 18 నెలల బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, బకాయిలు చెల్లించకుంటే 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులతో కలిసి నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవింద రాజులు, సునీత, శ్రావణి, రంగస్వామి, సతీశ్ కుమార్, ఇందు, శ్రీను, కిరణ్, అరుణ, విమల, గౌరీనాయుడు, పైడినాయుడు, శింగం శెట్టి మోహన్ ప్రసాద్, హరీష్, గాడి అజయ్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో మెరిట్ విద్యార్థులకు న్యాయం

- 107, 108 జీవోల ఉపసంహరణ
- ఏపీ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: వైద్యవిద్య వ్యాపారీకరణను అడ్డుకోవాలని, మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 107,108 జీవోలను రద్దు చేసి ఎంబీబీఎస్ విద్యార్థులకు న్యాయం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త వైద్య కళాశాలల్లో సీట్ల కేటాయింపు కోసం విడుదలైన ఈ జీవోల వల్ల వందల మంది విద్యార్థులు నష్టపోయారని తెలిపారు. ఐదు మెడికల్ కాలేజీల్లో సగం సీట్లు బీ, సీ విభాగాల కిందకు తెచ్చి... సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ.12 లక్షలు, ఎన్‌ఆర్ఐ సీట్లకు రూ.20 లక్షలు చొప్పున ఫీజు వసూలు చేశారన్నారు. 107,108 జీవోల ప్రకారం ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సీట్లలో 35శాతం సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లుగా, 15శాతం ఎన్‌ఆర్ఐ సీట్లుగా ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో అమ్ముకోవడం తగదన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకుండా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వే షన్లను ఈ రెండు విభాగాలలో లేకుండా చేయటం అన్యాయమన్నారు. బీ, సీ విభాగాల్లోని సీట్లు కేవలం డబ్బున్న వారికేనని, ఈ విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ వసతి లేదని వెల్లడించారు. రాష్ట్రంలోని కొత్త వైద్య కళాశాలల్లోనే కాకుండా రాబోయే ప్రభుత్వ కళాశాలలోనూ ఇదే పద్ధతి అమలవుతుందని తెలిపారు. ప్రస్తుతానికి మెడికల్ అడ్మిషన్లను ఎన్‌టీఏ వాయిదా వేసిందని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని ఆ జీవోలు రద్దు చేయాలని, మెరిట్-ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు న్యాయం చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమావేశంలో అడ్వకేట్ ఠాగూర్ యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం: అచ్చెన్నాయుడు

మంత్రిని కలిసిన ఎన్జీవో సంఘ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. గత ప్రభుత్వ పరిపాలనా విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా ఉన్నప్పటికీ ఉద్యోగులకు, పెన్షన్ దారులకు, ఇతర ప్రభుత్వ రంగ శాఖల ఉద్యోగులకు నిర్ణీత సమయంలో వేతనాల చెల్లించేం దుకుగాను సీఎం చంద్రబాబు అనుసరించిన విధానాలే కారణమని చెప్పారు. తొలుత ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం చౌదరి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ ఏపీఐఐసీ కాలనీలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో గురువారం మంత్రిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా అచ్చె న్నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల చంద్ర బాబుకు అపారమైన ఆదరాభిమానాలు ఉన్నాయని చెప్పారు. ఐదేళ్లలో ఎంతో మానసిక ఒత్తిడిని, అవమానాలను భరించి ప్రస్తుత ప్రభుత్వానికి అండగా నిలవడం ముదావహం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఖజానాలో ఒక్క రూపాయి నిల్వ లేనప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ న్యాయం చేసేందుకు సీఎం చేస్తున్న పరిపాలనకు ఉద్యోగులు తమ సహకారాన్ని అందించడం రాష్ట్ర అభివృద్ధికి శుభపరిణామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అంటే పాలనలో ఎంతో కీలకమని సీఎం అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు గతంలో తమ సమస్యలను చెప్పుకునేందుకు అవకాశం లేని దౌర్భాగ్య పరిస్థితులు ఇకముందు ఉండబోవన్నారు. సమస్యలను వినడంతో పాటు సీఎం దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర పురోభివృద్ధి లక్ష్యంగా సుహృద్భావ వాతావరణంలో కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ఆయా శాఖలలో విచారణ కొనసాగుతోందని, రాష్ట్రానికి నష్టం కలిగించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. ఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకులు రంజిత్ నాయుడు, శివప్రసాద్, మహిళా విభాగం నాయకురాలు నిర్మలకుమారి, శాంతి, వ్యవసాయశాఖ విభాగం ఉద్యోగుల సంఘం నాయకులు వేణుమాధవ్, సాయి కుమార్, పశుసంవర్ధక శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు సేవా నాయక్, రామకృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులు జానీ పాషా తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సెప్టెంబరు 10 నుంచి భాషా పరీక్షలు: ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో ఉన్న అధికారుల కోసం నిర్వహించే సెప్టెంబరు (2024) భాషా పరీక్షలను సెప్టెంబరు 10వ తేదీ నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ సెక్రటరీ జె.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షల కోసం ఆగస్టు 11వ తేదీలోగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను పిఎస్‌సి.ఎపి.గౌవ్.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

లోకేశ్ వాట్సప్ బ్లాక్

భారీ సంఖ్యలో మెసేజ్‌లు రావడమే కారణం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు జనం పోటెత్తుతుండగా, అదే స్థాయిలో మెసేజ్‌లు కూడా భారీ సంఖ్యలో వస్తుండడంతో ఆయన వాట్సప్ బ్లాక్ అయింది. దీనిని వెంటనే గమనించిన లోకేశ్ ఒక ప్రకటన చేస్తూ... సమస్య ఏదైనా, ఏ సహాయం కావాలన్నా ఇకనుంచి తనకు hello.lokesh@ap.gov.in మెయిల్ ఐడీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. మెసేజ్‌కు స్పందించి 25 మంది దివ్యాంగ విద్యార్థుల సమస్యను ఆఘమేఘాలపై పరిష్కరించడంతో... లోకేశ్ దృష్టికి సమస్య తీసుకెళితే చాలు పరిష్కారం అయిపోతుందన్న ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా వ్యాపించింది. దీంతో వేలాది మంది తమ సమస్యలను ఒకేసారి మంత్రి లోకేశ్‌కు వాట్సప్ చేస్తుండడం వల్ల ఆయన వాట్సప్‌కు సాంకేతిక సమస్య తలెత్తి బ్లాక్ అయింది. దీనిపై కూడా మంత్రి వెంటనే స్పందించి ఇకపై తనకు సమాచారం పంపే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తానే హ్యాండిల్ చేసే పర్సనల్ మెయిల్ ఐడిని తెలియజేస్తూ ప్రకటన చేశారు. పాదయాత్రలో యువతకు తనను దగ్గరగా చేర్చిన "హలో లోకేశ్" కార్యక్రమం పేరుతోనే ఈ మెయిల్ ఐడి క్రియేట్ చేసుకున్న మంత్రి... తానే అందరి సమస్యలు నేరుగా అడ్రస్ చేస్తానని వెల్లడించారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి, సమస్య-సహాయంకు సంబంధించిన పూర్తి వివరాలు వినతులలో పొందుపరచాలని సూచించారు. మెయిల్ చేస్తే తాను స్పందిస్తానని తెలియజేశారు. వాట్సప్ తరచూ బ్లాక్ కావడంతో ప్రజలు పంపే మెసేజ్‌లు చూసే అవకాశం ఉండటం లేదని, దయచేసి అందరూ మెయిల్ ఐడీకే వినతులు పంపించాలని మంత్రి ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవం

- 2019 టీడీపీ ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలి
- నాయకులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఉద్యోగులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం విజయవాడ బస్‌స్టాండ్ వద్ద గల విజయవాడ డిపో కమిటీ అధ్వర్యంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవానికి నాయకులు హాజరయ్యారు. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ 1952 జులై 11న యూనియన్ ప్రారంభం నుంచి నేటి వరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంస్థ బలోపేతం కోసం అలుపెరగని ప్రయత్నం చేస్తున్నామన్నారు. 73 ఏళ్లల్లో ఉద్యోగులకు అనేక సంక్షేమ పథకాలను సాధించామన్నారు. 2014 నుంచి 2019లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో గుర్తింపు సంఘంగా గెలిచి 2013 పీఆర్సీ 2015లో 43 శాతం, 2017 పీఆర్సీ 2019 ఫిబ్రవరిలో 25 శాతం సాధించి ఆర్టీసీ ఉద్యోగులకు మంచి జీతాలు అందించిన ఘనత ఈయూదేనని తెలిపారు. ఆర్టీసీ చరిత్రలో 1959 నుంచి ఇప్పటికి 15 సార్లు పీఆర్సీలు జరిగితే, 9 సార్లు పీఆర్సీలు చేసిన ఏకైక యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ అని గుర్తుచేశారు. జీవీ నరసయ్య మాట్లాడుతూ 2019లో అధికారంలో ఎంప్లాయిస్ యూనియన్ పోరాడి సాధించుకున్న ఉద్యోగ భద్రత ఉత్తర్వులను గత ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. దీనివల్ల ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరవైందని, తక్షణమే వారిని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామచందరరావు, ఎం.శంకరరావు, టీవీ భవానీ, మోహిద్దిన్, నారాయణ, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సాగర్, డిపో కార్యదర్శి రామకృష్ణ, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించండి

లోకేశ్ దృష్టికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు

విశాలాంధ్ర-విజయవాడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని ఆయన నివాసంలో గురువారం లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లకు నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దారిమళ్లించిన నిధులను రికవరీ చేసి బోర్డు అకౌంట్‌లో జమ చేయాలని, సంక్షేమ బోర్డు రాష్ట్ర స్థాయి కమిటీల్లో కేంద్రస్థాయి కార్మిక సంఘాల సభ్యులను నియమించాలని సూచించారు. రాష్ట్రం విభజన సమయంలో తెలంగాణ వద్ద ఉన్న సంక్షేమ బోర్డు నిధులను ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డుకు రప్పించాలని కోరారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాల నుంచి వన్ పర్సెంట్ సెస్సు అమలుకు చర్యలు తీసుకొని సంక్షేమ బోర్డుకు నిధుల లోటును భర్తీ చేయాలన్నారు. స్పందించిన మంత్రి... ఈ అంశాలను ముఖ్యమంత్రి, ఇతర అధికారులతో చర్చిస్తామని, తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకట సుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యన్నారాయణ, కోట సత్తిబాబు, అనపాన షణ్ముఖరావు, సోన రాజు, ఎన్.శ్రీరాములు, నీలకంఠ శివప్రసాద్, ఉప్పాడ సూర్యనారాయణ సూరం శెట్టి రామారావు, మెనుగు రామారావు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ పాలనలో కలానికి సంకెళ్లు

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కలానికి సంకెళు వేసింది. ఇందిరా గాంధీ హయాంలో 1975లో ప్రకటిత ఎమర్జెన్సీ అమలు కాగా నేడు మోదీ పాలనలో అదే రీతిలో ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. కేంద్రం అప్రకటిత ఎమర్జెన్సీని అమలుచేస్తూ మీడియా మీద, పౌర సంస్థల మీద ఉక్కుపాదం మోపుతున్నది. స్వేచ్ఛ లేని బతుకు అర్థరహితం, దాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అత్యంత విచారకరం. తమకు నచ్చని జర్నలిస్టులను తొలగించవలసిందిగా యాజమాన్యాలపై మోదీ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నదని, ప్రభుత్వ వాణిజ్య ప్రకటనలను నిలిపివేస్తున్నదన్న విమర్శలు బాగావున్నాయి. ఈ విమర్శలు నూటికి నూరుశాతం వాస్తవమే. మోదీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి దేశంలో పత్రికా స్వేచ్ఛ మంటగలిసిందని అంతర్జాతీయ ప్రెస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ) బుధవారం చేసిన వ్యాఖ్యలు పరిస్థితికి అద్దంపడుతున్నాయి. జర్నలిస్టులపై హింస, వేధింపులు, దాడులు, బెదిరింపులు పెచ్చుపెరిగిపోయాయని ఐపీఐ ఆందోళన వ్యక్తంచేసింది. భారత జర్నలిస్టులపై పెగాసెస్ దాడిని ఐపీఐ గుర్తు చేసింది. జర్నలిస్టుల ఫోన్లు హాక్ చేసి వారి గోప్యతా హక్కుకు భంగం కలిగించినట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, వాషింగ్టన్ పోస్ట్ సంయుక్తంగా ఆధారాలను బయటపెట్టాయని తెలిపింది. జర్నలిస్టులపై దాడుల మీద ఇంప్యూనిటీ సూచీ–2023లో 12వ వరస్ట్ దేశంగా భారత్ నిలిచిందని గుర్తుచేసింది. పాత్రికేయులకు రక్షణ కల్పించడంలో గత రెండు పాలనా కాలాల్లోనూ విఫలమైన మోదీ ప్రభుత్వం కనీసం ఈసారైనా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్యతివ్వాలని కోరింది. జర్నలిస్టులపై దాడులు, హత్యల కేసుల్లో విచారణను సమగ్రంగా, విశ్వసనీయంగా, పారదర్శకంగా జరిపించాలని విజ్ఞప్తి చేసింది. పాలకులు మీడియా స్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే తప్ప మరొకటి కాదనడంలో ఎటువంటి సందేహంలేదు. చరిత్రలో మీడియా స్వేచ్ఛ గురించి ఒకసారి పరిశీలిస్తే ఆనాడు లితో ప్రెస్ ద్వారా పత్రికలు వెలువడేవి. అదికూడా ప్రతి రోజూ పత్రికలు వచ్చేవికావు. అలాగే కరపత్రాలు, తదితరాల ద్వారా కూడా సమాచారాన్ని అందించేవారు. పశ్చిమ ఐరోపాలో ప్రత్యేకించి ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలలో 17, 18వ శతాబ్దాలలో ఫ్యూడలిస్టుల అణచివేతకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు మీడియా ఒక ఆయుధంగా ఉపయోగపడింది. ఆ కాలంలో అధికార విభాగాలన్నీ రాజులు, ప్రభువులు తదితర ఫ్యూడల్ పాలకుల చేతుల్లోనే ఉండేవి... అందువల్ల ప్రజలు కొత్త ఆయుధా లను తయారు చేసుకోవలసివచ్చింది. ఆయుధాలు ప్రజల ప్రయోజనాల ప్రతినిధులుగా ఉండాలి. అందువల్లనే ప్రజలు మీడియాను తమకు శక్తివంతమైన ఆయుధాలుగా తయారు చేసుకున్నారు. ప్రజల భవిష్యత్తు వాణిగా మీడియా రూపొందింది. ఫ్యూడల్ పాలకుల చేతుల్లో ఆయుధాలుగా మాత్రమే కాదు... ఇప్పుడు కూడా మనం అలాంటి పరిస్థితిని కల్పించుకోవాలి. ఫ్యూడల్ ఐరోపాను ఆధునిక ఐరోపాగా మార్పు చేసేందుకు అప్పట్లో మీడియా గొప్పగా ఉపయోగపడింది. మన దేశంలో రాజారామ్మోహనరాయ్, గణేశ్ శంకర్ విద్యార్థి, నిఖిల్ చక్రవర్తి, అరుణ అసఫాలీ తదితర అనేక గొప్ప జర్నలిస్టులు ఉండేవారు. వాళ్ల ఒంటరిగానే సమాజంలో నెలకొన్న దురాచారాలు, రుగ్మతలు, రైతుల ఆత్మహత్యలులాంటి సమస్యలను ప్రముఖంగా సమాజం దృష్టికి తీసుకువెళ్లేవారు. మరికొంతమంది ఇలాంటి వాటిని విస్మరించారు. అలాగే నిరంతరం మతోన్మాదాన్ని వ్యతిరేకించే జర్నలిస్టులు కూడా ఉన్నారు. అయితే అలాంటివాళ్ల అనేక కష్టాలపాలయ్యారు. ఉపా చట్టం కింద అనేక మంది జర్నలిస్టులను జైళ్లకు పరిమితం చేశారు. మోదీ పాలనలో మీడియా స్వేచ్ఛ గణనీయంగా క్షీణించింది. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ చర్యలను ఏడాది క్రితమే సిఫార్సు చేసినప్పటికీ ఆ దిశగా పురోగతి శూన్యం అని ఐపీఐ ఆందోళన వ్యక్తంచేసింది. పై పెచ్చు జర్నలిస్టులపై ఉపా చట్టం, ఐటీ చట్టం వంటివాటిని అస్త్రాలుగా ప్రయోగిస్తున్నారు. బీజేపీని విమర్శించే మీడియా సంస్థలు, జర్నలిస్టులను న్యాయ చిక్కుల్లో పడవేస్తున్నారు. జర్నలిస్టులను బెదిరించే పరంపర కొనసాగితే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుంది.

వాస్తవ సమస్యలను నుంచి ప్రజల దృష్టిని మరలించే విధంగా మీడియాను మోదీ ప్రభుత్వం లొంగదీసుకుంటోంది. సామాజిక, ఆర్థిక సమస్యలు, పేదరికం, నిరుద్యోగం, పిల్లల్లో పౌష్టికాహార లోపం రైతాంగం వెతలు, ఆరోగ్యభద్రత, నాణ్యమైన విద్య తదితర సమస్యలు అత్యధిక మీడియాలో కనిపించడంలేదు. ఫ్యాషన్ పెరేడ్‌లు, క్రికెట్‌లాంటి వాటికి విశేష ప్రాధాన్యతనిస్తున్నారు. దేశంలో మీడియా స్వేచ్ఛ ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాలి. ప్రజల సంక్షేమం కోసం మీడియా స్వేచ్ఛకు ఇబ్బందులు కలిగించకూడదు. మీడియా స్వేచ్ఛ అంటే యాజమాన్యాలకు స్వేచ్ఛ కాదు. మీడియా స్వేచ్ఛ అనేది ప్రజాసంక్షేమానికి ఉపయోగ పడాలి. మీడియా స్వేచ్ఛవల్ల అంతిమంగా సమాజానికి ప్రయోజనం కలగాలి. మీడియా స్వేచ్ఛ సమాజానికి ప్రయోజనం కలిగిస్తే అది ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేందుకు, గౌరవనీయమైన జీవితాన్ని, సామాజిక భద్రతను కల్పించేందుకు, ప్రజలు సంతోషంగా పురోగతిని సాధించేందుకు దోహదంచేస్తుంది. అందుకు విరుద్ధంగా యాజమాన్యానికి మాత్రమే స్వేచ్ఛ ఉంటే ఎందుకూ పనికిరాదు. ఐరోపాలో మీడియా నిర్వహించిన పాత్రను ఇక్కడ కూడా నిర్వహించాలి. పత్రికా స్వేచ్ఛ ద్వారానే ప్రజాస్వామ్యం సమర్థంగా పనిచేయగలదని మోదీ ప్రభుత్వం తెలుసుకోవాలి. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. మీడియా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వాతంత్ర్యంపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించడానికి జర్నలిస్టులంతా సమైక్య పోరాటం సాగించాల్సిన అవసరం ఎంతైనావుంది.

పార్టీల్లో వ్యక్తి పూజ



పార్టీ స్వామ్యం నశించాలి, వ్యక్తి పూజ నశించాలి. రా బావ ఏంటి ఈరోజు కొత్త స్లోగన్లు మొదలుపెట్టావు. అవును మారుతున్న కాలంలో మారుతున్న మనుషులను చూసి కొత్త స్లోగన్లు పుట్టుకొస్తాయి మరి. నిజమే సమాజంలో వ్యక్తిగతంగా సమస్యలు పరిష్కరించుకోవడం సాధ్యంకాక సంఘాలు, సంస్థలు, పార్టీలు ఏర్పాటు చేసుకుంటారు. అంత వరకు బాగానే ఉంది. మనిషికున్న సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకున్న పార్టీలో మనిషికి ప్రశ్నించే హక్కు లేకుండా పోయింది. ప్రజాస్వామ్యంలో పార్టీ స్వామ్యమే కనబడుతోంది. పార్టీలో కూడా అధినాయకుడు తప్ప ఎవరూ కనబడరు. పార్టీ ఏర్పాటు అయ్యే వరకే ప్రజలు ఆ తరువాత నాయకుల పెత్తనం. ప్రస్తుతం నాయకులకు, మంత్రులకు కూడ స్వేచ్ఛ లేదు. అంతా అధినాయకుడే చూసుకుంటాడు. నిజమే పదవుల కోసం అధినాయకుడిని వ్యక్తిపూజ మొదలుపెట్టారు. అయితే నాకొక అనుమానం. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రస్తుత ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శిష్యుడేకదా. ప్రస్తుతం రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో చర్చలు మొదలవుతున్నాయి గదా. వారిద్దరి నిర్ణయం రెండు రాష్ట్రాల ప్రజలు ఆమోదించవలసిందే గదా. అందులో అనుమానమేముంది. తొమ్మిది కోట్ల ప్రజల భవిష్యత్తు వారిద్దరి నిర్ణయంపైనే ఆధారపడిందన్న మాట. మన ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కుల గురించి వారిద్దరి నిర్ణయం ఆమోదించి తలవూపవలసిందేనన్నమాట. ప్రజాస్వామ్యం ఇంత దిగజారిపోతుందనుకోలేదు. కనీసం మంత్రులకు కూడా మాట్లాడటం, నిర్ణయాలను విభేదించే హక్కులేని ప్రజాస్వామ్యం మనది. ఇప్పుడు చెప్పు నా స్లోగన్లు తప్పు అంటావా. అదిసరే అటు జగన్, ఇటు చంద్రబాబు కేసుల్లో యిరుక్కుని కేంద్రానికి తలవంచి ప్రత్యేక హోదా వదులుకుంటే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంది గదా. ఏదైనా భరించవలసిందే. మనం ఏర్పాటు చేసుకున్న పార్టీలో మనకు మాటాడే హక్కు లేనపుడు యింకా మన సమస్యలు ఎవరితో చెప్పుకుంటాం. అయినా బావ కేంద్రంలో ఉన్న ప్రధానులు ముఖ్యంగా మోదీ ప్రతిపక్షం లేకుండా ఉంటే బాగుంటుంది అనుకుంటాడు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నాడని అందులో నేను ఒకడినని పార్లమెంటులో రాహుల్ అన్నాడు. ఇలా కేసుల్లో పాలించే నాయకులు ఇరుక్కుని రాష్ట్రానికి కావలసిన వాటిపై పోరాటం చేయకుంటే మోదీ సర్కారుకు తలవొంచితే రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది గదా. అంతె మరి. అధికారం కోసం ప్రజలు, పార్టీలు అవసరం. ఆ తరువాత పదవి సొంత సంపాదన ముఖ్యంగా మారుతున్నాయి. పదవులు దక్కిన తరువాత ప్రజలు, పార్టీలతో సంబంధం లేదు. మరల ఎన్నికలు వస్తేనే పార్టీలు అవసరం అవుతున్నాయి. సరే ఈ వ్యవస్థ మారాలంటే ఏం చేయాలంటావు. ఏముంది పార్టీలను పక్కనపెట్టి ప్రజల అవసరాల కోసం ప్రజా సంఘాలు ఏర్పాటు చేసుకుని కలిసివచ్చే చిన్న పార్టీలను కలుపుకుని హక్కుల కోసం పోరాటం చేయాలి. అంతేతప్ప ఈ పార్టీలను, పార్టీ నాయకులను నమ్ముకుంటే సమస్యలు అలాగే ఉంటాయి. ప్రజలే పోరాటం చేయాలి. ప్రస్తుతం నాయకులు తప్ప పార్టీలు కనబడని ఈ స్థితిలో ప్రజలే సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి. పార్టీలో వ్యక్తి పూజ ఎక్కువైంది. బీజేపీలో మోదీ–షా ద్వయం తప్ప మిగతా నాయకులకు స్వేచ్ఛ ఉన్నట్లు కనబడదు. అలాగే జగన్ ప్రభుత్వంలో కూడా జరగబట్టె యిలా ఘోర ఓటమి పాలయిందని కిందిస్థాయి నాయకులు వాపోతున్నారు. ప్రస్తుతం టీడీపీలో చంద్రబాబుకు ఎదురు ఎదురుచెప్పరు. జనసేన నాయకుల ప్రశ్నించవచ్చు. అందుకు ఉదాహరణ యిటీవల ఒక జనసేన నాయకుడు అమరావతి క్యాపిటల్ నిర్మాణం మంచిదికాదని ఎప్పుడైనా ముంపు ప్రమాదం ఉందని, అలా ముంపునకు గురైన రెండు మూడు రాజధానులను ఉదహరించారు. అంతేకాక గతంలో కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ యితర మేధావులు చెప్పినవి కూడా ఉదహరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అవసరం. ప్రజలకు వ్యతిరేక నిర్ణయాలు ప్రభుత్వం చేసినప్పుడు ప్రజల గొంతు వినిపించడానికి ప్రతిపక్షం అవసరం. ఆ అవసరం గుర్తించి ఎంతమంది అనే విషయం పక్కనపెట్టి జగన్‌కు ప్రతిపక్ష నాయకుని హోదా యిచ్చి ప్రజాస్వామ్యవాదిగా చంద్రబాబు చెప్పుకుంటే బాగుంటుంది. అలా యివ్వని పక్షంలో ప్రజల కోసం జనసేన ప్రతిపక్షంగా మారి ప్రజల గొంతు వినిపించవలసిన అవసరం ఉంది.

ఆదిలోనే ప్రధానికి ఎదురు దెబ్బలు

డా॥జ్ఞానపాఠక్

బీజేపీ నాయకుడు నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఆదిలోనే పాలనలో, రాజకీయాల్లో గట్టి ఎదురుదెబ్బలే తిన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి నెలలోనే పాలనకు సంబంధించి ఏమాత్రము సామర్థ్యాన్ని చూపింది లేదు. 2024 జూన్ 9 న ప్రధానిగ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నానన్న అభిప్రాయం లేకుండా పార్లమెంటు వెలుపల, లోపల ఆయన రాజకీయ హోదా దిగజారింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడంలో గణనీయంగా సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రతి విధానపరమైన, కార్యాచరణకు సంబంధించి బలమైన ప్రతిపక్షం నుంచి గట్టి సవాళ్లు ఎదురయ్యాయి. విధాన రూపకల్పన, కార్యకలాపాలు చేపట్టినపుడు జవాబుదారీతనం ప్రదర్శించాలని ప్రతిపక్షం కోరుతున్నది. పూర్వపు కేంద్ర ప్రభుత్వాలను ప్రత్యేకించి కాంగ్రెసు నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వాలను బదనామ్ చేసేందుకు ఆయనకు కొత్తగా అవకాశాలు లేవు. ఈ విషయంలో ఆయన వైఫల్యం కనిపిస్తోంది. రాజకీయంగా సందర్భోచితమైన అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు మోదీ గట్టిగా కృషి చేయవలసిందే. 18 వ లోక్‌సభకు జరిగిన ఎన్నికలకు ముందు చేసిన ప్రచారంలో 370 సీట్లు తమ పార్టీ గెలుచుకుంటుందని నమ్మబలికారు. అయితే వాస్తవంగా 240 సీట్లు మాత్రమే గెలుచుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి మరో 63 సీట్లు తక్కువయ్యాయి. దీంతో బీహార్‌కు చెందిన నితీష్‌కుమార్ నాయకత్వంలోని జెడియు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని టీడీపీల తోడ్పాటుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని మోదీ ఏర్పాటు చేశారు.

సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన రెండు రాజకీయ పార్టీలు "హిందు రాష్ట్ర" ఏర్పాటును సమర్థించడంలేదు. హిందు రాష్ట్ర ఏర్పాటు కావాలని ఆర్ఎస్ఎస్, బీజేపీలు చాలా కాలంగా కలలు కంటున్నాయి. ఈసారి ఇండియా, ఐక్య సంఘటన లోక్‌సభ ఎన్నికలలో 230 సీట్లను గెలుచుకుని బలమైన ప్రతిపక్షంగా ఏర్పడి సంకీర్ణ ప్రభుత్వాన్ని అనేక సమస్యలపై నిలదీస్తున్నవి. రాజ్యసభలోను గతంలో ఎన్డీఏతో కలిసి ఉన్న బీజేడీ ప్రతిపక్షాన్ని సమర్థిస్తూ మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నది. ఇండియా ఐక్య కూటమితో కలిసి సభ వాకౌట్‌లో పాల్గొన్నది. కొత్త రాజకీయ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తనను తాను సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తోంది. కాంగ్రెస్, నెహ్రూ–గాంధీ కుటుంబాలను ప్రతి విషయానికి విమర్శిస్తున్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు వారే కారణమని మాట్లాడుతూ తన తప్పులను, వైఫల్యాలను మాత్రం కప్పిపుచ్చుతున్నారు. అయితే అన్ని విషయాల్లోను ఆయన తప్పించుకోలేరని నీట్ పరీక్షాపత్రాల లీకుల విషయంలో స్పష్టంగా దొరికారు. మోదీ ప్రభుత్వ హాయంలోనే ఈ పరీక్షలు నిర్వహించారు. 2017 లో జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్‌టిఎ) ని ఏర్పాటు చేశారు. ఇది స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నది. నీట్ పరీక్షా పేపరు, యుజీసి–నెట్ పరీక్షా పేపర్లు లీక్ కావటం మోదీ ప్రభుత్వానికి పెద్ద తలవంపులుగా మారింది. ప్రభుత్వ వైఫల్యానికి ఇది గట్టి సవాలే అయ్యింది. ఈ అంశానికి కాంగ్రెస్ లేదా నెహ్రూ– గాంధీ కుటుంబానికి ఏమాత్రం సంబంధంలేదు. పరీక్షాపేపర్ల లీక్ బాధ్యత ప్రభుత్వమే వహించాలి.

> బీజేపీ నాయకుడు నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఆదిలోనే పాలనలో, రాజకీయాల్లో గట్టి ఎదురుదెబ్బలే తిన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి నెలలోనే పాలనకు సంబంధించి ఏమాత్రము సామర్థ్యాన్ని చూపింది లేదు. 2024 జూన్ 9 న ప్రధానిగ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నానన్న అభిప్రాయం లేకుండా పార్లమెంటు వెలుపల, లోపల ఆయన రాజకీయ హోదా దిగజారింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడంలో గణనీయంగా సవాళ్లు ఎదురవుతున్నాయి.

230 సీట్లు గెలుచుకున్న ఇండియా ఐక్య సంఘటన పేపర్ల లీక్‌పై లోక్‌సభలో చర్చించాలని డిమాండ్ చేసింది. లోక్షభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పరీక్షాపేపర్ల లీక్ అంశాన్ని లేవనెత్తి తక్షణం ఈ సమస్యను లోక్‌సభ చర్చించాలని కోరుతూ ప్రధానికి లేఖ రాశారు. దీనిపై మోదీ సమాధానమిస్తూ దోషులను అరెస్టు చేసేందుకు ప్రభుత్వం వేగంగా పనిచేస్తుందని పేపరు లీక్‌లకు బాధ్యులైన వారిని అరెస్టు చేస్తామని చెప్పారు. ప్రతిపక్షం బలంగా లేనపుడు చాలా తక్కువగా ప్రతిపక్ష సభ్యులు ఉన్నందు వల్ల అసలు సమాధానమే చెప్పేవాళ్ల కాదు. పార్లమెంటు రెండు సభల్లోను ప్రతిపక్షాన్ని లెక్కచేసేవారు కాదు. ఈ సమస్య ఇప్పుడు సుప్రీంకోర్టులో ఉంది. విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే ఈ సమస్య అంత తేలికగా పరిష్కారమయ్యేలా లేదు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్టీఏ పరీక్షలను నిర్వహించింది. ఈ క్రమంలో వివిధ చోట్ల ముందుగానే ప్రశ్నాపత్రాలు వెల్లడి చేశారు. వీటి నిర్వహణ బాధ్యత మోదీ ప్రభుత్వం తనది కాదని తప్పించుకునే అవకాశం లేదు. ప్రధాని మోదీ చెప్పే అబద్ధాలు ఇక్కడ పనిచేయవు. విద్యార్థులు, ఉద్యోగాలు కోరేవారు లేదా కోరుకునేవారి సమస్యను మోదీ పరిష్కరించకపోతే ఆయన రాజకీయ ప్రతిష్ఠ మరింత దిగజారి ఇప్పుడు గెలిచిన 240 సీట్లు కూడ మునుముందు ఉండదు. ఆదిలోనే ప్రభుత్వ వైఫల్యానికి ఇది గట్టి ఉదాహరణ.

పేపర్ లీక్, ఇంకా అనేక వైఫల్యాల మీద, సమస్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా విమర్శిస్తోంది. విమర్శలకు గురవుతున్న సమస్యల్లో రైల్వే ప్రమాదం తీవ్రమైంది. ఈ ప్రమాదానికి మోదీ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. రైల్వేలను నిర్వహించే సాంకేతిక భద్రత బాధ్యత కేంద్రానిదే. పెద్ద నోట్లు రద్దు చేయటానికి టెర్రరిస్టులకు తేలికగా ఇవి అందుతున్నాయని కారణంగా చెప్పారు. టెర్రరిస్టు దాడులను నిలిపివేసేందుకు నోట్ల రద్దు దోహదం చేస్తుందని చెప్పారు. అయితే జమ్ముకశ్మీర్ ప్రాంతంలో టెర్రరిస్టుల దాడులు ఏమాత్రం ఆగలేదు. నోట్ల రద్దుకు అసలు కారణం మోదీ బయటకు చెప్పరు. పాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, గ్యాస్ తదితర అనేక వస్తువుల ధరలు గత పదేళ్లుగా పెరుగుతూనే ఉన్నాయి. టోకు ధరల ద్రవ్యోల్బణం గత పదిహేను నెలలుగా లేని రికార్డును స్థాపించింది. మాస్కోలో ఉంటున్న భారతదేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జులై 9 నాటికి తాను ప్రధానిగా ప్రమాణం చేసిన గడువు నెల రోజులు అవుతుందని దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పుకున్నారు. దాన్ని మరింత బలోపేతంగా వేగంగా పనిచేయగలనని వారికి తెలిపారు. వేగంగా పురోగతిని సాధించేందుకు భవిష్యత్‌లో గణనీయమైన ఎప్పటికి మరువలేని విజయాలను సాధించగలనని చెప్పారు. 30 రోజుల్లో సాధించిన విజయాలు ఏమీలేవు. వంద రోజులు ఎజెండాను పెట్టుకొని ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4 కే సాధించామన్నారు. అయితే అత్యంత తక్కువ స్థాయిలో పరిపాలన ఉన్నది. బీజేపీ సాధించిన ఎన్నికల ఫలితాలు, వాస్తవ రాజకీయాలు, బలహీనతలు ప్రభుత్వంలో భాగంగా కనిపిస్తున్నాయి. అవినీతి నిర్మూలన, మౌలిక సదుపాయాల ఏర్పాటులో మోదీ పాలన పూర్తిగా విఫలమైంది. ఢిల్లీ విమానాశ్రయంలో నిర్మాణాలు కూలిపోవడం దేశ వ్యాప్తంగా వివిధ నిర్మాణాలు ప్రత్యేకించి బీహార్‌లో ఇప్పటికే పదమూడు బ్రిడ్జిలు కూలిపోవటం లాంటి మోదీ వైఫల్యాలు ప్రజలకు కనిపిస్తూనే ఉన్నాయి.

ఆరోగ్యరంగానికి అన్నీ కొరతే!



భారతదేశంలో ఆరోగ్యరంగానికి అన్నీ కొరతలే ఉన్నాయి. ఆరోగ్య భద్రత వృత్తి నిపుణులు, ఆస్పత్రులలో పడకలు, ఆస్పత్రికి వెళ్లడానికి ముందు, ఆ తర్వాత వైద్య సౌకర్యాల కోసం తగినన్ని నిధులను ఖర్చు చేయలేని రోగగ్రస్థులు, ప్రభుత్వం తగినన్ని నిధులు విడుదల చేయలేకపోవటం, ముందుగా బడ్జెట్ నిధులలో హామీ ఇచ్చిన నిధులను విడుదల చేయకపోవటం తదితర అనేక అంశాలలో తీవ్ర కొరత ఉంది. అయితే ప్రభుత్వం దీనికి భిన్నంగా వైద్య, ఆరోగ్య బీమా పథకాలను ప్రవేశపెట్టామని ఇది ఎంతగానో ఉపయోగపడుతున్నదని చాటింపు వేసుకుంటోంది. అయితే ఈ రంగాన్ని పట్టి పీడిస్తున్న నిధుల కొరతను ఎలా ఎదుర్కోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. 2024– 25 సంవత్సరానికి కేంద్రం బడ్జెట్‌ను రూపొందిస్తోంది. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందుగా ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ జూన్ 27 వ తేదీన ఆరోగ్యభద్రత పరిశ్రమ ప్రతినిధులు, వైద్య వృత్తి నిపుణులు ఇంకా ఇతర నిపుణులతో చర్చించారు. ఇప్పటికే ఈ రంగంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రముఖంగా ఆర్థికమంత్రి ముందుకు వచ్చాయి. తగినన్ని ప్రభుత్వ నిధులు కొరత ఉందన్న సమస్య ప్రభుత్వానికి తెలుసు. ప్రస్తుతం జీడీపీలో 1.2 శాతం మాత్రమే ప్రభుత్వం ఈ రంగానికి ఖర్చు చేస్తున్నదని తాజాగా లాన్సట్ విడుదలచేసిన నివేదిక తెలియజేస్తుంది. ఆర్థికమంత్రితో జరిగిన చర్చల్లో 2024– 25 కేంద్ర బడ్జెట్‌లో 3 శాతం కేటాయింపులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ పెంచే నిధులు సైతం అత్యవసరంగా అనారోగ్యానికి గురైన వారికోసం ఖర్చు చేయడానికే సరిపోతుంది.

ప్రస్తుతం ప్రజలు ఆశించే నిధులను ఖర్చు చేసేందుకు కూడ ఆర్థికశాఖ ఇబ్బందులు పడుతోంది. 2024-25 కేంద్ర బడ్జెట్‌ను జులై 23 న లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. తాత్కాలిక బడ్జెట్‌ను పార్లమెంటులో లోక్‌సభ ఎన్నికలకు నెలరోజుల ముందు 2024 ఫిబ్రవరి 1 వ తేదీన ప్రవేశపెట్టారు. 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి మొత్తం 90, 171 కోట్ల రూపాయలు కేటాయించారు. అంతకుముందు సంవత్సరం 79, 221 కోట్లు కేటాయించారు. గణనీయంగా పెంచినట్లు కనిపిస్తుంది కానీ అవసరమైన నిధుల కంటే చాలా తక్కువ. 2022 లో తలెత్తిన కోవిడ్ - 19 మహమ్మారి నాటికి మూడేళ్ల ముందు 2017 జాతీయ ఆరోగ్య విధానాన్ని అనుసరించి ఆరోగ్యరంగానిక ప్రభుత్వ పెట్టుబడి 2.5 శాతం అవసరమవుతుందని గుర్తించారు. కొన్ని అంతర్జాతీయ సంస్థల అంచనాల ప్రకారం కోవిడ్-19 మహమ్మారి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు జీడీపీలో 9 శాతం నిధులు అవసరమని తెలిపాయి. అయితే ఆరోగ్యరంగానిక ఇండియా 1.2 శాతం మాత్రమే ఖర్చుచేసింది. ఇది ఎంతమాత్రం ఆమోదించదగినది కాదు. 2017 లో జాతీయ ఆరోగ్య విధానం ప్రకారం కనీసం 2.5 శాతం నిధులు ఖర్చుచేయడంలో కూడా మోదీ ప్రభుత్వం విఫలమయింది. 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో జీడీపీలో 2.5 శాతం మొత్తాన్ని ఖర్చు చేసినట్టు అంచనావేస్తే జాతీయ వ్యయం 819 కోట్లుగా ఉండేది. అయితే కేంద్రప్రభుత్వం 3,27,718 కోట్లు కేటాయించవలసి వచ్చేది. అయితే తాత్కాలిక బడ్జెట్‌లో కేవలం 90,171 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇండియా రాజ్యాంగంలో ఆరోగ్యరంగాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చారు. ఈ రంగానికి రాష్ట్ర ప్రభుత్వాలు 60 శాతం ఖర్చు చేయవలసి ఉంటుంది.

లాన్సట్ తాజా నివేదిక ప్రకారం ఇండియా ప్రభుత్వం జీడీపీలో ఆరోగ్య భద్రతకు 1.2 శాతం మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసింది. జి-20 దేశాలలో ఇండియానే ఆరోగ్యరంగానికి అత్యంత తక్కువగా ఖర్చు చేస్తున్నది. అయితే మోదీ ప్రభుత్వం దీనికి అంగీకరించలేదు. పైన తెలిపిన అంచనాను ప్రభుత్వం విమర్శిస్తూ అన్ని సంవత్సరాల్లో కంటె ఎక్కువగా ఖర్చు చేశామని ప్రభుత్వం చెప్పుకుంటోంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ, మోదీ చేసిన ప్రచారాలలో అబద్ధాలనే చెప్పారు. ఇప్పుడు రాజకీయ వాస్తవాలను సంకీర్ణ ప్రభుత్వం గుర్తించింది. 2014-15 లో ఆరోగ్యరంగానికి ప్రభుత్వం చేసిన వ్యయం జీడీపీలో 1.13 శాతం మాత్రమే. ఇదే 2019-20 నాటికి 1.35 శాతం ఖర్చు చేశారు. 2023-24 లో 90,171 కోట్లు కేటాయించగా 86,175 కోట్లు మాత్రమే 2023-24 సంవత్సరానికి ఖర్చు చేశారు. 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో అతి తక్కువగా పెంచారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి బడ్జెట్‌లో గణనీయంగా నిధులు పెంచాలని కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వాన్ని విమర్శించినప్పటికీ ప్రభుత్వం తాను అనుకున్నట్టుగానే బడ్జెట్ ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య భద్రత, అవసరమైన ప్రజలకు సార్వత్రిక ఆరోగ్య పథకం కింద సేవలు అందించాలి. మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ లాంటి ముఖ్య పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో అవినీతి కేసులు చాలా ఎక్కువగా ఉన్నాయి. తగినన్ని నిధులు కేటాయించలేదు. ప్రైవేటు ఆసుపత్రులలో ప్రభుత్వం చికిత్స చేయించిన ఖర్చును ఆసుపత్రులకు ఇవ్వడానికి చాలా జాప్యం జరిగింది.

ఆయుష్మాన్ భారత్ పథకాన్ని 2018 లో ప్రారంభించారు. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 దామాషాలో నిధులను కేటాయిచాలి. తాత్కాలిక బడ్జెట్‌లో గత సంవత్సరం 7,500 కోట్లను కేటాయించారు. అంతకు ముందు సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం నిధులను 6,800 కోట్లకు తగ్గించారు. ఈ పథకం కింద ప్రజలకు ఆరోగ్య సదుపాయాలను వేగంగా అందించాలని తలపెట్టారు. అయితే ఈ పథకం కింద 12 కోట్ల కుటుంబాలకు ఏడాదికి 5 లక్షల రూపాయలు ఒక్కొక్క కుటుంబానికి ఆరోగ్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గత సంవత్సరం మే నెలలో ఆయా రాష్ట్రాలు తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అంతక్రితం నుంచే నిధులు తగ్గిపోవటం ప్రారంభమయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం వెయ్యి మందికి 3.5 శాతం పడకలను అందించటం ప్రామాణికంగా నిర్ధారించింది. అయితే మన దేశంలో రెండు పడకల కంటే తక్కువగా ఉన్నాయి. ఈ విషయంలో ఆయా రాష్ట్రాల రాజధానులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చాలా వ్యత్యాసాలున్నాయి. ఉదాహరణకు కర్నాటకలో ఏడాదికి వేయి మంది కోసం నాలుగు పడకలుండగా బీహార్‌లో 0.3 శాతం మాత్రమే ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ అత్యధిక ప్రజలకు అందుబాటులో లేదు.

– ఎడిట్‌పేజీ డెస్క్

సిసోడియా బెయిల్ విచారణ నుంచి తప్పకున్న న్యాయమూర్తి

న్యూఢిల్లీ: దిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణానికి సంబంధించి ఈడీ, సీబీఐ కేసుల్లో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై గురువారం విచారణ జరగాల్సి ఉండగా... ఈ కేసు విచారణ బెంచ్ నుంచి న్యాయమూర్తి సంజయ్ కుమార్ తప్పుకోవడంతో వాయిదా పడింది. దీంతో తదుపరి విచారణ ఈ నెల15వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ బెయిల్ పిటిషన్లను మరోబెంచ్ విచారణ చేపట్టనుంది. లిక్కర్ స్కాం కేసులో ఫిబ్రవరి 26వ తేదీన మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేసింది. అనంతరం మార్చి తొమ్మిదో తేదీన ఈడీ కస్టడీలోకి తీసుకుంది. దీంతో ఆయన దిల్లీ కేబినెట్‌కు ఫిబ్రవరి 28న రాజీనామా చేశారు. అదేవిధంగా జూన్ నాల్గో తేదీన సీబీఐ, ఈడీ దాఖలు చేసిన కేసుల్లో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది.

పార్లమెంటులో నిలదీస్తాం

మణిపూర్‌లో మోదీ పర్యటించాలి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: హింసాత్మక ఘర్షణలతో అల్లాడుతున్న రాష్ట్రంలో విషాదాన్ని అంతం చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కాంగ్రెస్, ఇండియా ఐక్య సంఘటన పార్లమెంటులో పూర్తి శక్తితో మణిపూర్‌లో శాంతి ఆవశ్యకతను లేవనెత్తుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా మణిపూర్‌లో పర్యటించాలని, రాష్ట్ర ప్రజల సమస్యలను వినాలని, శాంతి కోసం విజ్ఞప్తి చేయాలని కూడా ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం మణిపూర్‌లో హింసాకాండకు గురైన మణిపూర్‌లో తన రోజంతా పర్యటన సందర్భంగా అక్కడి ప్రజలతో తాను జరిపిన సంభాషణల వీడియోను పంచుకుంటూ గాంధీ 'ఎక్స్'లో హిందీలో చేసిన పోస్ట్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. 'మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుంచి నేను మూడుసార్లు సందర్శించాను. కానీ పరిస్థితిలో ఎటువంటి మెరుగుదల లేదు. నేటికీ రాష్ట్రం రెండు ముక్కలుగా విభజించబడింది. ఇళ్లు కాలిపోతున్నాయి. అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి. వేలాది కుటుంబాలు సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారు' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అన్నారు. 'ఈ విషాదాన్ని అంతం చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీ, ఇండియా ఐక్య సంఘటన పార్లమెంటులో పూర్తి శక్తితో మణిపూర్‌లో శాంతి ఆవశ్యకతను లేవనెత్తుతాయి' అని చెప్పారు. మణిపూర్‌లో తన రోజంతా పర్యటన సందర్భంగా రాహుల్ గాంధీ, బీజేపీ పాలిత రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని మూడు సహాయ శిబిరాలను సందర్శించారు. హింసాకాండ కారణంగా నిరాశ్రయులైన మైతేయిలు, కుకీలు అనే రెండు జాతులకు చెందిన వారితో సంభాషించారు. గత ఏడాది మే 3న మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన వారాల తర్వాత గాంధీ కూడా మణిపూర్‌ను సందర్శించారు. ఆయన జనవరి

2024లో రాష్ట్రం నుంచి తన 'భారత్ జోడో న్యాయ యాత్ర' ను కూడా ప్రారంభించారు. వీడియోలో, గాంధీ వివిధ సహాయ శిబిరాల్లో ప్రజలతో సంభాషించడం కనిపించింది. ప్రజలు తమ కష్టాలు, భయాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా వారి కోసం పోరాడాలని, వారి గొంతును పెంచాలని కాంగ్రెస్ నాయకుడు కోరారు. మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్, దాని ఎంపీలు ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశంలో లేవనెత్తారని, రాబోయే సమావేశంలో సమస్యలను మళ్లీ లేవనెత్తుతామని హామీ ఇచ్చారని గాంధీ వీడియోలో చెప్పారు.

'నేను మీకు సహాయం చేస్తాను. సమస్యను లేవనెత్తుతాను. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాను. కానీ మీరు మీ ఇంటికి తిరిగి వెళ్లగలరని నేను మీకు భరోసా ఇవ్వలేను ఎందుకంటే దీనికి ప్రభుత్వం వద్ద సమాధానం ఉంది. మీరు తదుపరి సమావేశాల్లో చూస్తారు. నేను మీ గళాన్ని పెంచుతాను' అని మణిపూర్‌లోని సహాయక శిబిరంలో గాంధీ ప్రజలకు చెప్పారు.

స్వదేశానికి ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగిసింది. ఈ నెల 8, 9 తేదీల్లో రష్యాలో పర్యటించిన మోదీ... తర్వాత ఆస్ట్రియా పర్యటనకు వెళ్లారు. తాజాగా రెండు దేశాల పర్యటనలు ముగించుకొని ప్రధాని భారత్ చేరుకున్నారు. గురువారం ఉదయం దిల్లీలోని పాలెం విమానాశ్రయంలో ఆయన దిగారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు మాస్కోలో మోదీ రెండు రోజులు పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా సోమవారం రాత్రి మోదీకి పుతిన్ తన అధికారిక నివాసంలో విందు ఇచ్చారు. రెండో రోజు ఇద్దరు నేతలు విస్తృత చర్చలు జరిపారు. రష్యా అధ్యక్షుడి ముందు ఉక్రెయిన్ యుద్ధంపై మోదీ తన అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా తన సైన్యంలో నియమించుకొన్న భారతీయులకు విముక్తి కల్పించేందుకు, వారిని వీలైనంత త్వరగా భారత్ పంపేందుకు రష్యా అంగీకారం తెలిపింది. పుతిన్‌తో జరిగిన భేటీలో ఈ అంశాన్ని మోదీ లేవనెత్తడంతో ఈ పరిణామం చోటుచేసుకొన్నదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. రష్యా సైన్యంలో 35-50 మంది భారతీయులు పనిచేస్తుండొచ్చని విదేశాంగ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే 10 మంది తిరిగి భారత్‌కు వచ్చేశారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ తెలిపారు. మాస్కో పర్యటన అనంతరం మోదీ మంగళవారం సాయంత్రం ఆస్ట్రియా వెళ్లారు. ఆ దేశ చాన్సలర్ కర్ల్ నెహమ్మార్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ఇద్దరు నేతలు చర్చలు జరిపారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్ సంక్షోభాలు చర్చకు రాగా, ఇది యుద్ధానికి సమయం కాదని మోదీ పేర్కొన్నారు. ఉక్రెయిన్, రష్యా శాంతి ప్రక్రియలో భారత్ ఎంతో ప్రధానమైనదని, అది శక్తివంతమైన, ప్రభావవంతమైన పాత్ర పోషించగలదని నెహమ్మార్ అన్నారు. అదే సమయంలో తమ దేశం తటస్థ విధానాన్ని అవలంబిస్తుందని అన్నారు.

పెద్ద తప్పు చేశా

ముంబై కారు ప్రమాద నిందితుడి అంగీకారం

ముంబై: కారుతో ఢీకొట్టి ఓ మహిళ మృతికి కారణమైన ప్రధాన నిందితుడు తన తప్పు ఒప్పుకున్నాడు. తాను చేసిన తప్పును అంగీకరిస్తున్నానని, ఇక తన కెరీర్ ఇంతటితో ముగిసిపోయిందని మిహిర్ షా సిట్ విచారణలో అంగీకరించాడు. శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా ఇటీవల ముంబైలోని వర్లీ ప్రాంతంలో తెల్లవారుజామున మద్యం మత్తులో కారు నడిపి ఓ వివాహిత మరణానికి కారణమైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులైన మిహిర్, అతడి డ్రైవర్ రాజశ్రీ బిదావత్‌ను సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా నిందితుడు మిహిర్ తాను చేసిన తప్పునకు చింతిస్తున్నట్లు పోలీసుల ముందు వాపోయాడు. ప్రమాద సమయంలో కారు కింద మహిళ ఇరుక్కున్న విషయం తెలియదని నిందితులు వెల్లడించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రమాదం జరిగిన తర్వాత కారు చక్రాల కింద మహిళ ఇరుక్కుపోయిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. నిందితుడు మహిళను కారుతో లాక్కెళ్తున్న సమయంలో కొందరు వాహనదారులు కారు ఆపమని వారించినా వినిపించుకోలేదని పోలీసులు తెలిపారు. వారు ఇచ్చిన వాంగ్మూలాలను ధ్రువీకరించాల్సి ఉందని వెల్లడించారు. 1.5 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లిన తర్వాత మిహిర్, అతడి డ్రైవర్ సీట్లు మార్చుకున్నారు. ఇంజన్ బే వద్ద ఉన్న మహిళ మృతదేహాన్ని తొలగించి రోడ్డుపై పడేశారు. పోలీసుల్ని తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో అతడు జుట్టు ట్రిమ్‌చేసి...గడ్డం గీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ ఘటన తర్వాత అతడు ఆటోలో గర్ల్‌ఫ్రెండ్ ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు.

థాక్రే, పవార్‌తో మమత భేటి నేడు

కోల్‌కత్తా: ఉద్ధవ్ థాక్రే, శరద్ పవార్‌ను శుక్రవారం ముంబైలో కలవనున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. వీలైతే అఖిలేశ్ యాదవ్‌ను కూడా కలిసే అవకాశం ఉందన్నారు. మీడియాతో గురువారం ఆమె మాట్లాడుతూ... వ్యాపారవేత్త ముఖేశ్ అంబానీ కుమారుడి వివాహం కోసం నేను ముంబై వెళ్తున్నా... ఇదే సమయంలో శివసేన నేత ఉద్ధవ్ థాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో సమావేశం కాబోతున్నా... ఈ సందర్భంగా దేశ రాజకీయాలపై చర్చించబోతున్నాం.. లోక్‌సభ ఎన్నికల తర్వాత మొదటిసారిగా మేము భేటీ అవుతున్నాం. రేపటి భేటీకి అఖిలేశ& యాదవ్ కూడా వచ్చే అవకాశం ఉంది అని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. మమతా బెనర్జీ ఇండియా కూటమి పార్టీ నేతలతో భేటీ కావడం ప్రాధాన్యత చోటుచేసుకుంది. వీరి సమావేశంలో ఏం చర్చిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ముడా స్కామ్ నాపై కుట్రే

సిద్ధరామయ్య

మైసూరు : మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ద్వారా భూములు కోల్పోయిన వారికి స్థలాల కేటాయింపులో మోసపూరితంగా ఆరోపణలు చేసిన కేసులో తనను అనవసరంగా లక్ష్యం చేస్తున్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం తెలిపారు. ముడాలో ఆయన భార్య పార్వతికి స్థలాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. వెనుకబడిన వర్గానికి చెందిన తాను రెండోసారి ముఖ్యమంత్రి అయినందున గుండెల్లో గుబులు పుట్టి తనపై కుట్ర జరుగుతోందని, ఇలాంటి కుట్రలకు భయపడబోనని తేల్చిచెప్పారు. ఈ కుంభకోణానికి సంబంధించి జులై 12న సిద్దరామయ్య సొంత జిల్లా మైసూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి వై విజయేంద్ర 'భారీ' నిరసనను ప్రకటించడంపై ముఖ్యమంత్రి స్పందించారు. 'మేము దానిని (ముడా స్కాం) విచారణకు ఇవ్వలేదా... బీజేపీ రాజకీయాలు చేస్తే మేము రాజకీయాలు చేయవలసి ఉంటుంది. రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు' అని అన్నారు. తన భార్యకు కేటాయించిన స్థలాలపై బీజేపీ తనను లక్ష్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్న ప్రశ్నకు... 'ఎక్కడ అక్రమం జరిగిందో వారే చెప్పాలి. చట్టబద్ధమైన విషయాలు చెబుతున్నాం. అది అక్రమమని చూపనివ్వండి' అని సీఎం అన్నారు. 'అనవసరంగా రాజకీయాల కోసం నన్ను లక్ష్యం చేస్తున్నారు. వెనుకబడిన వర్గానికి చెందిన సిద్దరామయ్య రెండవ సారి ముఖ్యమంత్రి కావడంతో వారు గుండెల్లో మంటలు కలిగి ఉన్నారు. అందువల్ల నేను అలాంటి కుట్రలకు భయపడతానా?' అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ హయాంలో కూడా జరిగిన అవకతవకలపై విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు ముడా తప్పు చేస్తే సిద్దరామయ్య దానికి ఎలా బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

ఐఎన్ఎల్‌డీతో బీఎస్‌పీ పొత్తు

హర్యానా సీఎం అభ్యర్థిగా అభయ్ చౌతాలా

చండీగఢ్ : ఈ ఏడాది చివరిలో జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల కోసం ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డీ) తన మాజీ మిత్రపక్షమైన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తో మళ్లీ చేతులు కలపాలని నిర్ణయించుకున్నట్లు రెండు పార్టీల నేతలు గురువారం ప్రకటించారు. ఐఎన్ఎల్‌డీ నాయకుడు అభయ్ చౌతాలాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉండాలని కూటమి నేతలు నిర్ణయించారు. ఈ పొత్తు ప్రకారం, హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకుగాను బీఎస్పీ 37 స్థానాల్లో పోటీ చేస్తుంది. సీనియర్ భాగస్వామికి మిగిలిన స్థానాలను వదిలివేస్తుంది. చండీగఢ్ శివార్లలోని నయాగావ్‌లో బీఎస్పీతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో చౌతాలా మాట్లాడుతూ కూటమి ఎటువంటి స్వార్థ ప్రయోజనాలపై ఆధారపడి లేదని, ప్రజల భావాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పడిందని నొక్కి చెప్పారు. 'హర్యానాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోరాడాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్రాన్ని దోచుకుంటున్న బీజేపీని అధికారం నుంచి తరిమికొట్టి, రాష్ట్రాన్ని 10 సంవత్సరాల క్రితం దోచుకున్న కాంగ్రెస్ పార్టీని గద్దె దింపాలని ఈరోజు సామాన్యుల భావన' అని చౌతాలా చెప్పారు. ఇటీవలే బీఎస్పీ అధినేత్రి మాయావతి, చౌతాలా పొత్తు పెట్టుకోవడంపై సవివరంగా సమావేశమయ్యారని బీఎస్పీ జాతీయ సమన్వయకర్త ఆకాష్ ఆనంద్ తెలిపారు. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాల్లో బీఎస్పీ 37 స్థానాల్లో పోటీ చేయాలని, మిగిలిన చోట్ల ఐఎన్ఎల్‌డీ పోటీ చేయాలని ఆ సమావేశంలో నిర్ణయించినట్లు వివరించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే చౌతాలాను ముఖ్యమంత్రిని చేస్తామని ఆనంద్ అన్నారు. ఈ కూటమి కేవలం అసెంబ్లీ ఎన్నికలకు మాత్రమే పరిమితం కాదని, భవిష్యత్‌లో రాష్ట్రంలో జరిగే ఇతర ఎన్నికల్లో ఉమ్మడిగా పోరాడతామని ఆనంద్ తెలిపారు. ప్రకటన వెలువడిన వెంటనే, ప్రజా వ్యతిరేక పార్టీలను ఓడించి కొత్త సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీఎస్పీ, ఐఎన్ఎల్‌డీ కలిసి పనిచేస్తాయని మాయావతి 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 'ప్రజా వ్యతిరేక పార్టీలను ఓడించి కొత్త సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో బహుజన్ సమాజ్ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్ దళ్ కలిసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానాలో పోరాడతాయని, నా పూర్తి ఆశీర్వాదంతో ఈ రోజు చండీగఢ్‌లో సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రకటించారు' అని ఆమె పేర్కొంది. సీట్ల పంపకాల విషయంలో పూర్తి ఏకాభిప్రాయం కుదిరిందని, ప్రత్యర్థులను ఓడించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రెండు పార్టీల మధ్య ఐక్యత దోహదపడుతుందని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో చౌతాలా మాట్లాడుతూ కూటమితో చేతులు కలిపేందుకు, బలమైన ఫ్రంట్‌ను నిర్మించడానికి కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా మరిన్ని పక్షాలను చేర్చాలనుకుంటున్నామన్నారు. 'అవసరమైతే మేము ఆమ్ ఆద్మీ పార్టీతో కూడా మాట్లాడవచ్చు' అని చౌతాలా ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, ఇతర సంస్థలతో చర్చలు జరపడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఈ సందర్భంగా మహాకూటమి నాయకులు అధికారంలోకి వస్తే ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చారు. ఏ ఇంటికీ రూ.500 (నెలకు) కంటే ఎక్కువ కరెంటు బిల్లు రాకుండా ఉండేలా ఏర్పాటు చేస్తాం. తాగునీటికి ప్రజల నుంచి వసూలు చేయబోమని హామీ ఇచ్చారు. వృద్ధాప్య పింఛను ప్రస్తుతం నెలకు రూ.3,000 నుంచి రూ.7,500కి పెంపు, వంట ఖర్చుల కోసం మహిళలకు రూ.1,100తో ప్రతి ఇంటికి ఉచిత వంట గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ యువతకు రూ.21,000 నిరుద్యోగ భృతి, షెడ్యూల కులాల పేద ప్రజలకు 100 చదరపు గజాల ప్లాట్లు తదితర హామీలు ఉన్నాయి. షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన నియామకాలలో బ్యాక్‌లాగ్‌ను భర్తీ చేస్తామని చౌతాలా చెప్పారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, ఈ హామీలన్నీ కేబినెట్ తొలి సమావేశంలోనే నెరవేరుస్తామని ఆయన వివరించారు.

ఆశించిన ఫలితాలు రాలేదు

లోక్‌సభ ఎన్నికలపై డీకే శివకుమార్

బెంగళూరు: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో తాము 14 నుంచి 15 స్థానాల్లో విజయం సాధిస్తామని ఆశించామని, కానీ ఆశించిన ఫలితాలు రాలేదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపై ఆ పార్టీ నేతలు సమాలోచనలు జరుపుతున్నారు. మీడియాతో గురువారం మాట్లాడుతూ... తాము ఎక్కడ తప్పు చేశామో విశ్లేషించేందుకే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఎక్కడెక్కడ పొరపాట్లు జరిగాయో విశ్లేషించుకుని, వాటిని సరిదిద్దుకుని భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ముందుకెళతామని చెప్పారు. బీజేపీ, జేడీఎస్ రాబోయే రోజుల్లో కలిసి పోరాడతాయని తనకు తెలుసునని, భవిష్యత్‌లో ఈ రెండు పార్టీలను నిలువరించేందుకు ఏం చేయాలనేదానిపై కసరత్తు సాగిస్తున్నామని అన్నారు. కాగా, ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో విపక్ష ఇండియా కూటమిపై బీజేపీ-జేడీయూతో కూడిన ఎన్డీయే పైచేయి సాధించింది. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలకు గాను కూటమి 19 స్థానాల్లో విజయం సాధించగా కాంగ్రెస్ కేవలం తొమ్మిది స్థానాలకు పరిమితమైంది. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, బీజేపీ యువమోర్చా అధినేత తేజస్వి సూర్య, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి వంటి ప్రముఖులు విజేతల్లో ఉన్నారు.

అంబానీ ఇంట పెళ్లికి దేశాధినేతలు, మాజీ ప్రధానులు

ముంబై: ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు జరిగిన ముందస్తు వేడుకలకు ప్రపంచస్థాయి అతిథులు హాజరయ్యారు. జులై 12న జరగనున్న పెళ్లికి దేశవిదేశాలకు చెందిన అతిథులకు ఆహ్వానం అందింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం ముంబైలోని బాంద్రా కుర్లా సెంటర్‌లోని జియో వరల్డ్ సెంటర్‌లో అనంత్-రాధికా మర్చంట్ వివాహం జరగనుంది. దీనికి బ్రిటన్ మాజీ ప్రధానులు టోనీ బ్లెయిర్, బోరిస్ జాన్సన్ రానున్నట్లు సమాచారం. అమెరికన్ రియాలిటీ స్టార్లు కిమ్ కర్దాషియన్, ఖ్లో కర్దాషియన్, లైఫ్‌కోచ్ జేశెట్టి, అమెరికా విదేశాంగశాఖ మాజీమంత్రి జాన్ కెర్రీ, స్వీడన్ మాజీ ప్రధాని కార్ల్ బిడ్ట్, కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్, టాంజానియా అధ్యక్షుడు సామియ సులుహు హస్సన్, ఐఓసీ ఉపాధ్యక్షుడు జాన్ ఆంటోనియో, ఫిఫా అధ్యక్షుడు గియన్ని ఇన్‌ఫాంటినో వంటి ప్రముఖులు రానున్నారు. వ్యాపార రంగం నుంచి హెచ్ఎస్‌బీసీ ఛైర్మన్ మార్క్ టకర్, ఆరామ్కో సీఈఓ అమిన్ నాస్సర్, మోర్గాన్‌స్టాన్లీ ఎండీ మైకేల్ గ్రిమ్స్, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ముబాదలా ఎండీ ఖల్దూన్ ఆల్ ముబారక్, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ జేలీ, లాక్‌హీడ్ మార్టిన్ సీఈఓ, బీపీ సీఈఓ, ఎరిక్సన్ సీఈఓ, కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ఎండీ బదెర్ మొహమ్మద్ అల్‌సయీద్, నోకియా ప్రెసిడెంట్ టామీ ఉయిటో సహా అనేక ప్రపంచస్థాయి సంస్థల ఛైర్మన్‌లు, ఎండీలు, సీఈఓలు అంబానీల ఆతిథ్యం అందుకోనున్నారని తెలుస్తోంది. ఇదిలాఉంటే... రేపటి నుంచి మూడురోజుల పాటు పెళ్లి వేడుకలు జరగనున్నాయి. జులై 12న ముఖ్య ఘట్టమైన 'శుభ్ వివాహ్'తో మొదలయ్యే ఈ ఉత్సవాలు... 13న 'శుభ్ ఆశీర్వాద్', 14న 'మంగళ్ ఉత్సవ్'తో ముగుస్తాయి.

జమ్మూకశ్మీర్‌లో సోదాలు ముమ్మరం

కతువా ఘటనతో భద్రతాదళాలు అప్రమత్తం

జమ్మూ : కతువా జిల్లాలో సైనిక పెట్రోలింగ్‌పై ఆకస్మిక దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం అన్వేషణ గురువారం నాల్గవ రోజుకు చేరుకుంది. జమ్మూకశ్మీర్‌లోని కతువా-ఉదంపూర్-దోడా బెల్ట్‌లోని కొండలు, దట్టమైన అడవులలో మరింత మంది సైనిక సిబ్బందిని మోహరించారు. సోమవారం జరిగిన దాడిలో ఐదుగురు సైనిక సిబ్బంది మృతి చెందగా, అనేక మంది గాయపడినప్పటి నుంచి ఉగ్రవాదులకు ఆహారం, ఆశ్రయం కల్పించినట్లు అనుమానిస్తున్న ముగ్గురు వ్యక్తులతో సహా 60 మందిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో ఒకరు ఆహారం వండి ఒక వ్యక్తికి అప్పగించిన మహిళ ఉంది. తయారు చేసిన ఆహార పరిమాణం '10 నుంచి 16 మందికి' సరిపోతుందని వారు చెప్పారు. ఈ ఆహారాన్ని ఉగ్రవాదుల కోసం ఉద్దేశించినట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయన్నారు. కతువాలో జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు చెందిన సీనియర్ పోలీసు, సరిహద్దు భద్రతా దళ అధికారులు సమావేశమై ఉగ్రవాదులు చొరబడినట్లు భావిస్తున్న అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి ఉన్న భద్రతా వ్యవస్థపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. అంతర్రాష్ట్ర భద్రతా సమీక్షా సమావేశంలో జమ్మూకశ్మీర్, పంజాబ్ సరిహద్దుల్లోని జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడానికి ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడంపై చర్చలు జరిగాయన్నారు. గాలింపు చర్యల్లో పేలుడు పరికరాలు అమర్చే ముప్పు ఉన్నందున దళాలు జాగ్రత్తగా కదులుతున్నాయని అధికారులు తెలిపారు. జమ్మూ ప్రాంతంలోని కతువా, ఉదంపూర్, దోడా జిల్లాల్లోని కొండ ప్రాంతాలలో ఈ అన్వేషణ కొనసాగుతోంది. జూన్ నుంచి తీవ్రవాద సంఘటనలు చోటుచేసుకున్నాయి.

విరిగిపడిన కొండచరియలు...

తృటిలో తప్పించుకున్న కార్మికులు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు ఎడతెరిపిలేకుండా కురుస్తున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్‌లో దేవుడిని దర్శించుకునేందుకు వెళ్లిన భక్తులకు కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగి పడుతున్నాయి. రోడ్లు, రహదారులను అధికారులు ముందు జాగ్రత్తగా మూసేస్తున్నారు. దీంతో భక్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. చమోలీ జిల్లాలో బద్రీనాథ్ యాత్రాస్థలిని కలిపే జాతీయ రహదారిపై ఇటీవల చూస్తుండగానే ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడడంతో భయభ్రాంతులకు గురైన అక్కడి ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. హైవేపై కొండచరియలు విరిగిపడటంతో శిథిలాల కారణంగా రహదారిని అధికారులు మూసివేశారు. సుమారు 48 గంటల పాటు ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ప్రకటించారు. కాగా బద్రీనాథ్ హైవేను తిరిగి తెరిచేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. రహదారిపై పడిన శిథిలాలను కార్మికులు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కార్మికులు పనిచేస్తుండగా పర్వతం నుంచి ఒక్కసారిగా బండరాళ్లు కిందపడ్డాయి. అయితే ఈ ప్రమాదం నుంచి కార్మికులు తృటిలో తప్పించుకున్నారు. రాళ్లు జారడం చూసిన కార్మికులు కొండపైకి పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక బద్రీనాథ్ జాతీయ రహదారి మూసివేయడంతో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. రహదారిని క్లియర్ చేసేందుకు బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. జోషిమఠ్ వద్ద రహదారిని క్లియర్ చేసేందుకు సుమారు 241 ఎక్స్‌కవేటర్లను అక్కడ మోహరించారు. ఉత్తరాఖండ్‌లో వర్షం, కొండచరియలు విరిగిపడటంతో 260కి పైగా రోడ్లు మూసేశారు. . రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లో భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా ఛార్‌దామ్ యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇంధన అన్వేషణ, ఉత్పత్తి రంగాల్లో భారీ పెట్టుబడులు: హర్దీప్ సింగ్

న్యూఢిల్లీ: భారత్‌లో ఇంధన ఉత్పత్తి, అన్వేషణ రంగాల్లో భారీ పెట్టుబడికి అవకాశాలున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఈ రంగాల్లో 2030 నాటికి భారత్‌లో ఏకంగా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడికి అవకాశాలున్నాయని వెల్లడించారు. దిల్లీలోని భారత్ మంటపంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. భారత్‌లో ఇంధన వనరుల అన్వేషణ, ఇంధన ఉత్పత్తిలో అవకాశాల గురించి ఈ వేదికపై చర్చ జరిగింది. భారత్‌లోని 26 అవక్షేప బేసిన్లలో ఇప్పటికీ ఇంధన వనరుల అన్వేషణ, వెలికితీతకు అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. మన వద్ద భూగర్భ వనరులు ఉన్నా గతంలో తగినంతగా ఈ రంగాల్లో పురోగతి చోటుచేసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌లో కేవలం పది శాతం అవక్షేప బేసిన్లలో ఇంధన వనరుల వెలికితీత జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇది త్వరలో 16 శాతానికి పెరుగుతుందని మంత్రి వివరించారు. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో భారత్ తన చమురు సరఫరాదారును మార్చని పక్షంలో భారత్‌లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగిఉండేవని తెలిపారు. ఇంధన అన్వేషణకు భారత్ శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటోందని, నూతన డేటాను సమీకరించేందుకు రూ. 7500 కోట్లు వెచ్చిస్తోందని పేర్కొన్నారు.

నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో

సూత్రధారి అరెస్టు

రాకీకి 10 రోజుల రిమాండ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచనలంగా మారిన నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో సూత్రధారి రాకేశ్ రంజన్ అలియాస్ రాకీ అరెస్టు అయ్యాడు. అతనిని పది రోజుల రిమాండ్‌కు తరలించారు. రాకీని సీబీఐ గురువారం అదుపులోకి తీసుకుంది. బీహార్ రాజధాని పాట్నాలోని రెండు స్థానాల్లో, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో రెండు చోట్ల సోదాలు నిర్వహించిన క్రమంలో రాకీ పట్టుబడినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు రాకీ మినహా ఎనిమిది మందిని సీబీఐ అరెస్టు చేసింది. మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌లనుదాఖలు చేసింది. ప్రశ్నపత్రాల సీల్ తీసినప్పుడు అక్కడే ఉంటూ ఫొటోలు తీసి 'సాల్వర్ గ్యాంగ్స్'కు రాకీ పంపేవాడని దర్యాప్తు సంస్థ గుర్తించింది. (సాల్వర్ గ్యాంగ్స్ అంటే లీకైన ప్రశ్నపత్రాలకు జవాబులు అందజేసే ముఠా) ఆపై అవి అభ్యర్థులకు చేరుతాయి. ఇందుకోసం వారు లక్షల రూపాయలు చెల్లిస్తారు. ముఠాలో కీలకమైన సంజీవ్ ముఖియాతోనూ రాకీకి సంబంధాలున్నాయి. రెండు దశాబ్దాలుగా పేపర్ లీక్ మోసాలకు పాల్పడిన అతను పరారీలో ఉన్నాడు. రాకీ అరెస్టుతో 'నీట్' కేసులో చిక్కు ముడులన్నీ విప్పుకుం టాయని భావిస్తున్నారు. అయితే ప్రశ్నపత్రాలు ఎక్కడ నుంచి లీకయ్యిందనే విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదని సీబీఐ వర్గాలు తెలిపాయి. అవి బ్యాంకు శాఖల నుంచిగానీ స్కూలుకు తరలించే క్రమంలో లేక స్కూల్లోనే లీకై ఉండవచ్చని ఆధారాలు సూచిస్తున్నట్లు పేర్కొన్నాయి.

నీట్‌పై సుప్రీం విచారణ 18కి వాయిదా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్-యూజీ పరీక్షల అక్రమ వ్యవహారంపై మరోసారి విచారణ చేపట్టిన భారత సర్వోన్నత న్యాయస్థానం...తదుపరి విచారణను జులై 18కి వాయిదా వేసింది. తొలుత దీనిపై శుక్రవారమే విచారణ చేపడతామని చెప్పినప్పటికీ... సొలిసిటర్ జనరల్ అభ్యర్థన మేరకు వాయిదాను పొడిగించింది. 'జులై 8న ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ వ్యవహారంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ), కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తమ స్పందనలు తెలియజేశాయి. ఆ అఫిడవిట్లు అందరు పిటిషన్‌దారులకు ఇంకా చేరలేదు. వాటిని పరిశీలించేందుకు వీలుగా సమయమిస్తూ తదుపరి విచారణ జులై 18కి వాయిదా వేస్తున్నాం' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. లీకైన నీట్ ప్రశ్నపత్రం బీహార్‌లోని ఒక్క పరీక్ష కేంద్రానికే పరిమితమైందని, విస్తృతంగా వ్యాప్తి చెందలేదని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సుప్రీంకోర్టుకు తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఇది వ్యాప్తి చెందలేదని పేర్కొన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన నివేదికను న్యాయస్థానానికి సీల్డ్ కవర్‌లో గురువారం అందజేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకైనమాట వాస్తవమని తేలడంతో ఇందులో అవకతవకలు జరిగాయనడంలో ఎటువంటి సందేహం లేదని సుప్రీంకోర్టు ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, ఇది 23 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంతో ముడిపడి ఉన్నందున 'మళ్లీ పరీక్ష' నిర్వహణపై నిర్ణయం తీసుకునేముందు దీని విస్తృతి ఏ మేరకు ఉందనే విషయం తెలుసుకోవాలని అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే ఎన్‌టీఏ, కేంద్రంతోపాటు సీబీఐ నుంచి నివేదికలు కోరింది.

పెండింగ్ డిమాండ్ల సాధనకు

మళ్లీ ఉద్యమిస్తాం

- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన
- 16-18 తేదీల్లో ప్రధాని, ప్రతిపక్ష నేతకు వినతులు
- ఎంపీలకు డిమాండ్ల పత్రాల అందజేత
- ఆగస్టు 9న 'కార్పొరేట్ క్విట్ ఇండియా దినం'
- కేంద్రానికి 15 ముఖ్య డిమాండ్లు
- ఎస్‌కేఎం సర్వసభ్య సమావేశం తీర్మానం

న్యూఢిల్లీ: పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం మరో ఉద్యమానికి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సిద్ధమైంది. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చట్టం, రుణ మాఫీ, పంట బీమా, రైతులు, వ్యవసాయ కార్మికులకు పింఛన్, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమాన్ని పునరుద్ధరించాలని సంకల్పించింది. విడిగా వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టాలని కేంద్రప్రభుత్వాన్ని ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. కేంద్ర సహకార శాఖను రద్దు చేయాలని, వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ విధించరాదని, జీఎస్టీ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేసింది. సహకార ఫెడరిలాజాన్ని, జాతీయ జల వనరు విధానం ఆధారిత పటిష్ఠ సంఘం కోసం పన్నులపై రాష్ట్ర ప్రభుత్వ హక్కులకు హామీనిచ్చేలా జీఎస్టీ చట్టాన్ని సవరించాలని కేంద్రానికి సూచించింది. చారిత్రక రైతాంగ ఉద్యమప్పుడు ప్రాణాలు కోల్పోయిన 736 మంది రైతుల సన్మానార్థం సింఘు/టిక్రీ సరిహద్దుల వద్ద స్మారకాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. ఈనెల 16, 17, 18 తేదీల్లో వినతులతో పాటు డిమాండ్ పత్రాలను ప్రధానికి, ప్రతిపక్ష నాయకుడికి, పార్లమెంటు సభ్యులకు అందజేయాలని పిలుపునిచ్చింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఏ) నుంచి నిష్క్రమించాలని, వ్యవసాయోత్పతులు, వాణిజ్యంలో ఎంఎన్‌సీలు రద్దు కోసం డిమాండ్ చేసింది. ఆగస్టు 9వ తేదీని కార్పొరేట్ల క్విట్ ఇండియా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది. ఐక్యఉద్యమాల కోసం కేంద్ర కార్మిక సంఘాలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని నిశ్చయించింది. సంయుక్త కిసాన్ సర్వసభ్య సమావేశం డాక్టర్ అశోక ధవలే, డాక్టర్ దర్శన్ పాల్, యుధ్వీర్ సింగ్, బల్బీర్ సింగ్ రాజేవాల్, రావుల వెంకయ్య, మేధా పాట్కర్, సత్యవాన్, రుల్దు సింగ్ మాన్సా, డాక్టర్ సునీలం, అవిక్ సహా, డాక్టర్ ఆశీష్ మిట్టల్, తజిందర్ సింగ్ విర్క్, కన్వర్జిత్ సింగ్, హన్నన్ మొల్లా అధ్యక్షతన జరిగింది. 17 రాష్ట్రాల నుంచి 143 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సర్వసభ్య సమావేశాల నిర్ణయాలను న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేతలు రావుల వెంకయ్య, హన్నన్ మొల్లా, యుధ్వీర్ సింగ్, సునీలం, అవిక్ సహా, కృష్ణప్రసాద్, ప్రేమ్ సింగ్ గెహ్లావత్ ప్రకటించారు. రైతు నాయకులు అమ్రారాం (రాజస్థాన్-సికర్), రాజారామ్ సింగ్ (బీహార్-కారకట్), సుదామా ప్రసాద్ (బీహార్-అర్రా), ఆర్.సచితానంతమ్ (తమిళనాడు-దిండిగుల్) పార్లమెంటుకు ఎన్నిక కావడంపై సర్వసభ్య సమావేశం హర్షం వ్యక్తంచేసిందన్నారు. బీజేపీ నేతృత్వ ఎన్డీయే కార్పొరేట్ అనుకూల విధానాల్లో మార్పును ఆశించాల్సిన అవసరం లేదని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు తప్పబోవని తీర్మానించిందని చెప్పారు. ఆగస్టు 17న ఎస్‌కేఎం పంజాబ్‌శాఖ అధ్వర్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రుల ఇళ్ల ఎదుట మూడు గంటల పాటు రైతులు ధర్నా చేస్తారని ప్రకటించారు. పంజాబ్‌లో నీటి ఎద్దడి, రుణభారం, ఇండియా-పాకిస్థాన్ వాణిజ్యం కోసం రోడ్డు కారిడార్లు తెరిపించడం వంటి అనేక అంశాలపై నిరసన తెలుపుతారన్నారు. అలాగే నీటి సంక్షోభం, వాతావరణ మార్పు ద్వారా వ్యవసాయంపై ప్రభావం అనే అంశంపై అదే రోజు అన్ని రాష్ట్రాల్లో సెమినార్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూకశ్మీర్‌లో రాష్ట్ర సమన్వయ కమిటీల అధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయని చెప్పారు. స్వతంత్ర, విస్తృత ప్రచారానికి కార్యాచరణను ఈ సమావేశాలు ఖరారు చేస్తాయని నాయకులు తెలిపారు. ఇదే క్రమంలో జాతాలు, పాదయాత్రలు, మహా పంచాయత్‌లు జరుగుతాయన్నారు. ఆయా రాష్ట్రాల రైతుల సమస్యలను గుర్తించేందుకు అన్ని రాష్ట్రాల్లో సమన్వయ కమిటీలు భేటీ అవుతాయని తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాలు, వర్కర్లు వ్యవసాయ కార్మికుల సంఘాలతో పాటు విద్యార్థి, యువజన, మహిళా, ప్రజా సంఘాలతో సమన్వయ కమిటీల ఏర్పాటునకు సర్వసభ్య సమావేశం నిర్ణయించిందని, 15 ప్రధాన డిమాండ్లతో తీర్మానాన్ని ఆమోదించిందని నాయకులు తెలిపారు.

అధికారులు బాధ్యతగా మెలగాలి: మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తూ, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆ శాఖ అధికారులతో గురువారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఉద్యోగాల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు సాధ్యాసాధ్యానాలు పరిశీలించాలని సూచించారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేలా వారికి సమాచారం అందేలా చూడాలన్నారు. ఉద్యోగుల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి కె.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

16 వరకు వైసీపీ నేతలపై చర్యలొద్దు: హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తమపై కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకెళ్లిన వైసీపీ నేతలకు ఊరట లభించింది. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంతో పాటు వివిధ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీ నేత దేవినేని అవినాశ్ తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు వీరి పిటిషన్‌పై గురువారం విచారించింది. తదుపరి విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది. అప్పటివరకు వైసీపీ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

వీళ్లు గురువులేనా?

పాఠశాలకు మద్యం తాగి వచ్చి...

భోపాల్: విద్యార్థులకు చదువు నేర్పించి... సంస్కారవంతులుగా తీర్చిదిద్దే గౌరవప్రదమైన స్థానంలో గల ఉపాధ్యాయులు సంస్కారహీనులుగా ప్రవర్తిస్తూ ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చారు. నిత్యం మద్యం సేవించి పాఠశాలకు వచ్చి... విద్యార్థుల దృష్టిలో 'ఛీ' అనిపించుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లా మహేద్వాని ప్రాంత పరిధిలోని 15 మంది ఉపాధ్యాయులు ఘోరంగా వ్యవహరించారు. అత్యంత హేయమైన వీరి వ్యవహారంపై స్థానిక బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నోటీసులు జారీ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు సుమారు 460 కి.మీ దూరంలో ఉంటుంది మహేద్వాని. ఎక్కువగా గిరిజనులే నివసిస్తుంటారు. ఈ ప్రాంతంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 15 మంది ఉపాధ్యాయులపై స్థానిక ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో తాజాగా చర్యలకు ఉపక్రమించారు. 'మా ఉపాధ్యాయుడు ఎప్పుడో ఒకసారి వస్తారు. అప్పుడు కూడా మద్యం తాగి వస్తారు. కొన్నిసార్లు మమ్మల్నే చదువుకోమని చెప్పి వెళ్లిపోతారు' అని ఎనిమిదో తరగతి విద్యార్థి ఒకరు వాపోయారు. మరో విస్తుపోయిన విషయం ఏమిటంటే... 9 మంది ఉపాధ్యాయులు గత కొన్నేళ్లుగా పాఠశాలకు రావడం లేదు. రికార్డుల్లో మాత్రం వచ్చినట్టు హాజరు నమోదవుతోంది. అంతేకాకుండా ఏడుగురు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా రెండో పెళ్లి చేసుకున్నట్లు తేలింది. ఆయా ఘటనలపై గిరిజన సంక్షేమశాఖ అసిస్టెంట్ కమిషనర్ సంతోశ్ శుక్లా స్పందించారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాస్థాయిలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను మెరుగుపరిచేందుకు తనిఖీలు విస్తృతం చేస్తామన్నారు. వృత్తిపరంగా నిబంధనలను అతిక్రమించిన వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

గ్లోబల్ హబ్‌గా మెడ్‌టెక్ జోన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాయం: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గ్లోబల్ హబ్‌గా విశాఖపట్నం మెడిటెక్ జోన్ తయారవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీని వైద్య రంగంలో మొదటి స్థానంలో నిలపాలన్న ఉద్దేశంతోనే తమ హయాంలో మెడ్‌టెక్ జోన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు, సిబ్బందితో గురువారం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెడ్‌టెక్ జోన్‌లో మరో రెండు కంపెనీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో వైద్య పరికరాల కోసం మెడిటెక్ జోన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఇది అసాధ్యమని చాలా మంది అన్నారని, కానీ ఇప్పుడు మెడిటెక్ జోన్ సాధిస్తోన్న విజయాలను చూస్తే చాలా ఆనందంగా ఉందని తెలిపారు. 2019లో ప్రభుత్వం మారడంతో కొన్ని ఇబ్బందులు ఎదురవడంతో పెట్టుబడులు పెట్టేందుకు కూడా చాలా మంది ఆసక్తి చూపలేదన్నారు. అయితే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో సంస్థ ప్రతినిధులు ముందుకు నడిపించారని, యాజమాన్యాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. 1999లో తాను రెండో సారి ముఖ్యమంత్రి అయిన తర్వాత బయో టెక్నాలజీ పార్కుకు 2 వేల ఎకరాలు కేటాయించడంతో అక్కడ 700 విభాగాల్లో 30 వేల మంది పని చేస్తున్నారని అన్నారు. మూడవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక విశాఖలో శర్మ నాయకత్వంలో మెడ్‌టెక్ జోన్ ఏర్పాటుకు ముందుకొచ్చామన్నారు. కోవిడ్ సమయంలో ఇక్కడి నుంచి వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సిట్రేటర్లు, మొబైల్ కంటెయినర్ యూనిట్, ఐ ల్యాబ్, ఆర్టీపీసీఆర్ తయారయ్యాయని, ఇతర వైద్య సామాగ్రిని అందించి కోట్లాది మంది ప్రజల ప్రాణాలు కాపాడారని ఆయన వివరించారు. 275 ఎకరాల విస్తీర్ణంలో 140కి పైగా కంపెనీలు ఇక్కడ పని చేస్తూ 10 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందని, 6 వేల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో 20 రాష్ట్రాల వారు ఇక్కడ తయారైన సామాగ్రినే వినియోగించినప్పటికీ ఏపీలో గత ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. రానున్న రోజుల్లో భోగాపురం విమానాశ్రయం కూడా అందుబాటులోకి వస్తుందని, మెడిటెక్ జోన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సహకారం అందిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

పిడుగులు పడి 38 మంది మృతి

లక్నో: కొన్నిరోజులుగా భారీ వర్షాలు ఉత్తరాది రాష్ట్రాలను వణికిస్తున్నాయి. అదేసమయంలో పిడుగులు పడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో బుధవారం ఒక్కరోజే కొన్ని జిల్లాల్లో పిడుగుపాటుకు గురై 38 మంది మృత్యువాతపడ్డారు. అత్యధికంగా ప్రతాప్‌గఢ్ జిల్లాలోనే 11 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో ఏడుగురు, చందౌలీలో ఆరుగురు, మెయిన్‌పురిలో ఐదుగురు, ప్రయాగరాజ్‌లో నలుగురు మరణించారు. పిడుగుపాటుకు అనేకమంది గాయాలపాలయ్యారని అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. పిడుగుపాటు వల్ల ఎక్కువమంది ప్రతాప్‌గఢ్ జిల్లాలోనే మృతి చెందారు. బాధితుల్లో ఎక్కువమంది 13 నుండి 15 సంవత్సరాల మధ్య వయసుగలవారేనని అధికారులు వెల్లడించారు. ఇదే జిల్లాలో పొలంలో పని చేస్తున్న సమయంలో పిడుగు పడడం వల్ల ఇద్దరు అన్నదమ్ములు చనిపోయారు. వర్షం కురుస్తున్న సమయంలో ఓ చెట్టు కింద తలదాచుకున్న మహిళ పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఔరయ్యా జిల్లాలో వర్షం కురుస్తున్న సమయంలో మామిడిచెట్టు కింద తలదాచుకున్న 14 ఏళ్ల బాలుడు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. డియోరియో జిల్లాలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. పొలానికి వెళ్తున్న ఓ ఐదేళ్ల చిన్నారిపై పిడుగుపడడంతో ఆ చిన్నారి మృతి చెందాడు. రాష్ట్రంలో ప్రధాన నగరమైన వారణాసిలో పిడుగుపాటుకు ఇద్దరు అన్నదమ్ములు గాయపడ్డారు. ఇందులో ఒక సోదరుడు మృతి చెందగా... మరొక సోదరుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రతాప్‌గఢ్ జిల్లా అధికారులు ఆసుపత్రికి తరలించారు.

తమిళ జాలర్లను విడిపించండి: స్టాలిన్

చెన్నై: భారత్‌కు చెందిన మత్స్యకారుల్ని శ్రీలంక అరెస్టు చేయడంపై తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్రానికి లేఖ రాశారు. తాజాగా మరో 13 మంది జాలర్లను అరెస్టు చేసి వారి నుంచి మూడు బోట్‌లు సీజ్ చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి సత్వరమే వారిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాజా అరెస్టు ఘటనను ప్రస్తావించిన సీఎం స్టాలిన్... కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు గురువారం లేఖ రాశారు. 'శ్రీలంక అధికార యంత్రాంగం 173 చేపల బోట్‌లు, 80 మంది మత్స్యకారుల్ని నిర్బంధించాయి. ఈ చర్యలు వారి జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా ఆ కుటుంబాలకు ఎంతో వేదన కలిగించాయి. అందువల్ల ఈ అంశాన్ని తక్షణమే పరిష్కరించేలా సమన్వయంతో చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నా. మత్స్యకారులతో పాటు వారి ఫిషింగ్ బోట్‌లను తక్షణమే వదిలిపెట్టేలా తగిన దౌత్యమార్గాల్లో ప్రయత్నించాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టే చర్యలేమిటి?

న్యూఢిల్లీ: విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్య అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ ఘటనలను అరికట్టేందుకు ఏం చేస్తున్నారని కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనిపై అఫడవిట్ దాఖలు చేయాలంటూ సీజేఐ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. విద్యార్థుల ఆత్మహత్యల్ని అరికట్టడానికి చర్యలను డిమాండ్ చేస్తూ గౌరవ్ బన్సల్ అనే న్యాయవాది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని న్యాయస్థానం విచారించింది. సమాచార హక్కు చట్టం కింద దిల్లీ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశ రాజధానిలో 2014-18లో 400 మందికిపైగా 18 ఏళ్ల లోపు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2022లో దేశవ్యాప్తంగా 1.71 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.

యూపీలో 17 మంది వైద్యులపై వేటు

లక్నో: కనీస సమాచారం ఇవ్వకుండా దీర్ఘ కాలంగా సెలవు పెట్టిన 17 మంది వైద్యులపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వేటు వేసింది. ఈ మేరకు ఆదేశాలివ్వాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ గురువారం వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సూచించారు. మానవసేవే మాధవ సేవ అని, ప్రజలకు సేవ చేసే అవకాశం లభిస్తే అలసత్వం వహించడం తనకు నచ్చదని పాఠక్ అన్నారు. ప్రజలకు బాధ్యతాయుత సేవలు అందించగలగడం గొప్ప అవకాశమని ఆయన చెప్పారు.

గ్రామీణ రహదారుల అనుసంధానంపై దృష్టి

7,213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక : పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రూ.4,976 కోట్లతో 7,213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి చకాచకా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమన్నారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం, ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు మరింత కోరదామని పవన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రాజెక్టుపై పవన్‌కు ఏఐఐబీ అధికారులు వివరించారు. 250 మందికి మించి జనాభా కలిగిన ప్రతి గ్రామానికి రహదారుల అనుసంధానం అవసరమన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొదలైన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామాల్లో నాణ్యతతో కూడిన రహదారుల నిర్మాణం సాధ్యమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం వల్ల గ్రామాల్లో రహదారుల నిర్మాణ ప్రక్రియ కుంటుబడిందని పవన్ అన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తే గ్రామీణ ప్రజలకు నాణ్యతతో కూడిన రహదారులు అందుబాటులోకి వచ్చేవని, గ్రామీణ అభివృద్ధి సాధ్యమయ్యేదన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం పనుల్లో పారదర్శకతను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక పోర్టల్ ఉండాలని, ప్రజల సలహాలు, సూచనలు స్వీకరించేలా ఆ పోర్టల్‌లో ప్రత్యేక కాలమ్ పొందుపర్చాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు. సమావేశంలో ఏఐఐబీ అధికారులు ఫర్హాద్ అహ్మద్, అశోక్ కుమార్, శివరామకృష్ణ శాస్త్రి, పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలూ నాయక్, ఏపీఆర్ఆర్పీ అధికారులు సీవీ సుబ్బారెడ్డి, పీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

మాజీ అగ్నివీరులకు కానిస్టేబుల్ పోస్టుల్లో కోటా

న్యూఢిల్లీ: కేంద్ర సాయుధ దళాల్లోని 10శాతం కానిస్టేబుల్ పోస్టులను మాజీ అగ్నివీరులకు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్ తెలిపారు. 2022 జూన్ 14న అగ్నిపథ్ పథకం అమల్లోకి వచ్చింది. సాధారణ సైనికులతో పోలిస్తే వీరికి లభించే జీతభత్యాలు తక్కువ. సర్వీసు కూడా నాలుగేళ్లకే పరిమితం. నియమిత అగ్నివీరుల్లో 25 శాతం మందికి 15ఏళ్ల సర్వీసును పొడిగిస్తారు. మిగిలిన 75 శాతం మందిని తొలగిస్తారు. వారంతా కొత్తగా ఉద్యోగాల వేటలో పడాల్సిందే. పైగా అగ్నివీరులకు పింఛన్, గ్రాట్యుటీ ఉండవు. విపక్షాల నిరసనలతో ప్రభుత్వం గరిష్ఠ వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచింది.

ఎన్నికల కోడ్ కేసు... జయప్రద నిర్దోషి

లక్నో: ఎన్నికల నియామవళి ఉల్లంఘనకు సంబంధించిన కేసులో మాజీ ఎంపీ, సినీనటి జయప్రదకు ఊరట లభించింది. ఈ కేసులో ఆమెను యూపీ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఆజం ఖాన్ చేతిలో ఓటమి చవిచూశారు. అయితే... ప్రచార సమయంలో ప్రత్యర్థి ఆజం ఖాన్‌పై చేసిన వ్యాఖ్యలతోఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదైంది. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల న్యాయస్థానం గురువారం ఆమెను నిర్దోషిగా ప్రకటించినట్లు సీనియర్ న్యాయవాది అమర్‌నాథ్ తివారీ వెల్లడించారు. న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించిన సమయంలో ఆమె కోర్టులోనే ఉన్నారు. అనంతరం జయప్రద విలేకరులతో మాట్లాడుతూ 'రాంపూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యాను. ఎప్పుడూ ఇక్కడే ఉంటాను. నేనెప్పుడూ తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు. సత్యమేవ జయతే' అని పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.